నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 28-9-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి:31 సంచిక:49 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

మన బాలికలను గాచుచు
తనివిని గలిగించు శారదా చట్టంబున్
పనివడి తెచ్చిన వారికి
ననయము జేయంగవలయు నభినందనలన్

(28-9-1929 శారదా చట్టం అమలైన రోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

చురక

అధినేతల తప్పులకు
అధికారులకు శిక్షలు
కంచే చేను మేసినంకా
కనిపించునా రక్షలు
కాళేశ్వర ప్రాజెక్టు
కాగలదా గుణపాఠం
అవనీతి అక్రమాల
అరికట్టని కోలాటం

-వేల్పుల నారాయణ
9440433475

మూసి పరివాహక ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం- సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 27 :మూసీ పరివాహక ప్రాంతంలో చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణ కు ముందుకు రావాలని ఆయన పారిశ్రామికవేత్తలకు సూచించారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు పర్యాటక రంగాన్ని కూడా ముందుకు తీసుకెళతామని తెలిపారు.

హైదరాబాద్ లోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐ తో రాష్ట్ర పర్యాటక శాఖ శుక్రవారం ఒప్పందం చేసుకుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా కారణంగా నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని సీఎం అన్నారు. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని , త్వరలోనే అందులో శాసన మండలి ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

ప్రస్తుతం శాసనమండలి ఉన్న జూబ్లీ హాల్ కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రత్యేక టెక్నాలజీతో ఆ భవనాన్ని నిర్మించారని, భవిష్యత్తులో దాన్ని పరిరక్షించాల్సిన అవసరముందని సీఎం అభిప్రాయపడ్డారు. జూబ్లీహాల్ ను దత్తత తీసుకొని పరిరక్షించాలని ఆయన సీఐఐ కి సూచించారు. ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని పరిరక్షిస్తామని, ఇందుకోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహాల్ స్టేడియానికి తరలిస్తున్నట్లు సీఎం వివరించారు.

హైకోర్టు భవనాన్ని కూడా రక్షించాల్సిన అవసరముందని సీఎం అన్నారు. రాజేంద్రనగర్ లో హైకోర్టు నూతన భవనం నిర్మాణం కోసం 100 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్ సిటీ కాలేజ్ భవనంతో పాటు పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతోందన్నారు.

పురాతన బావులు దత్తత తీసుకున్న పారిశ్రామికవేత్తలు

నగరంలో పురాతన మెట్ల బావులను పునరుద్ధరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు ఒప్పంద పత్రాలు అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్ధరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. సాయి లైఫ్ సంస్థ మంచిరేవుల మెట్ల బావిని దత్తత తీసుకుంది. భారత్ బయోటెక్ సంస్థ సాలార్ జంగ్, అమ్మవల్లి బావులను పునరుద్ధరించనున్నది. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్ నుమా మెట్ల బావిని టీజీ ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోరి ఉమెన్స్ కాలేజీ పునరుద్ధరించనున్నది.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం తెలంగాణ దర్శిని..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉచితంగా రాష్ట్రంలో పర్యాటక, చారిత్రక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందు కోసం తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని తీసుకువచ్చామని, దానికి సంబంధించిన జీవోను ఇప్పటికే జారీ చేశామన్నారు. చారిత్రక, పర్యాటక ప్రాంతాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం తెలంగాణ దర్శిని తీసుకువచ్చినట్లు సీఎం వివరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి ప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

వయాట్రీస్- హరే కృష్ణ ఛారిటబుల్ ఫౌండేషన్ ఒప్పందం

సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ కోసం వయాట్రీస్-హరే కృష్ణ ఛారిటబుల్ ఫౌండేషన్ ల మధ్య ఒప్పందం కుదిరింది.

సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఫౌండేషన్ సీఈఓ కౌంతేయ దాస, కంపెనీ అడ్మినిస్ట్రేటివ్ హెడ్ మిషెల్ డొమినికా ఎంపోయూపై సంతకాలు చేశారు.

ఈ ఒప్పందం ద్వారా కొడంగల్ నియోజకవర్గంలోని 312 స్కూళ్లల్లో చదువుతున్న 28 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందుబాటులోకి రానుంది. సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా వయాట్రీస్ సంస్థ రూ.6.4కోట్ల విరాళం అందించింది.

ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటి విరాళం అందజేసిన భారత్ బయోటెక్ .

సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి కోటి రూపాయిల చెక్ నుభారత్ బయోటెక్ కో-ఫౌండర్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్లా నేడు అందజేశారు. ఈ సందర్భంగా విరాళమిచ్చిన బయోటెక్ యాజమాన్యాన్ని అభినందించారు రేవంత్.

హైదరాబాద్ రానున్న రాష్ట్రపతి ముర్ము

-నల్సార్ స్నాతకోత్సవానికి హాజరు
-సిటీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
-పర్యటన ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్
-ట్రాఫిక్ డైవర్షన్ వివరాలు వెల్లడించిన అడిషనల్ సీపీ

హైదరాబాద్, సెప్టెంబర్ 27 :భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం హైదరాబాద్ రానున్నారు. ఈ నేపథ్యంలో బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో పోలీస్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక, అటవీ, విద్యుత్, తదితర శాఖల ఏర్పాట్లపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా భద్రతా ఏర్పాట్లు, బందోబస్తును పర్యవేక్షించాలని పోలీసులకు సూచించారు. అనంతరం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన 8 రాష్ట్రాలకు సంబంధించిన స్టాళ్లను, నాలుగు ఫుడ్ కోర్టులు, మీడియా సెంటర్, ఇతర స్టాళ్లను పరిశీలించారు.

పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు..

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా శనివారం హైదరాబాద్ నగరంలోని పలుప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని అడిషనల్ సీపీ ట్రాఫిక్ విశ్వప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి బేగంపేట , హెచ్‌పీఎస్, పీఎన్‌టీ జంక్షన్, రసూల్‌పురా, సీటీఓ, ప్లాజా, తివోలి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, బొల్లారం రాష్ట్రపతి నిలయం ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులుంటాయని స్పష్టం చేశారు.

నల్సార్ స్నాతకోత్సవం లో ప్రెసిడెంట్ ..

శామీర్‌పేట లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయలో శనివారం జరిగే 21వ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా ద్రౌపది ముర్ము హాజరవుతున్నారు. గౌరవ అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, నల్సార్ చాన్స్‌లర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సర్సింహులు విచ్చేస్తున్నట్లు విశ్వవిద్యాలయ వీసీ క్రిష్ణదేవరావ్ మీడియాకు వెల్లడించారు.

గ్లోబల్ సిటీ హైదరాబాద్‌కు పెట్టుబడులతో తరలిరండి

-పరస్పర అభివృద్ధిలో పలుపంచుకుందాం
-అమెరికన్ కంపెనీలతో కలిసి
-తెలంగాణ వ్యాపార బంధాలు మరింత బలోపేతం
-వినూత్న ఆవిష్కరణలు, నిలకడతో కూడిన అభివృద్ధి కి బాటలు వేద్దాం
-హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో మరిన్ని అవకాశాలు
-మైన్ ఎక్స్ పో ఇంటర్నేషనల్ సదస్సులో భట్టి పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పునరుత్పాదక విద్యుత్, వస్త్ర ఉత్పత్తిలో ఎంతో ముందు చూపుతో పురోగమిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అమెరికన్ కంపెనీల భాగస్వామ్యాన్ని సహకారాన్ని కోరుతోందని, గ్లోబల్ సిటీ హైదరాబాద్ కు పెట్టుబడులతో తరలిరావాలని తెలంగాణ అమెరికన్ కంపెనీలకు పిలుపునిచ్చారు.

అమెరికాలోని లాస్ వెగాస్ లో జరుగుతున్న మైన్ ఎక్స్ పో 2024 అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రపంచ వ్యాప్త వ్యాపార దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రముఖ అమెరికన్ కంపెనీల ప్రతినిధుల సమావేశాలలో ఆయన మాట్లాడారు. భారతదేశ ఆర్థిక పురోగతిలో అమెరికన్ కంపెనీలు కీలక పాత్ర పోషించాయని, ముఖ్యంగా తెలంగాణలో దిగ్గజ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఫేస్ బుక్, ఆపిల్ సంస్థలు హైదరాబాద్ ను తమ స్వస్థలంగా భావిస్తూ.. వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని తద్వారా హైదరాబాద్ గ్లోబల్ ఐటీ కేంద్రంగా, ఇన్నోవేషన్ హబ్ గా రూపుదిద్దుకున్నదని తెలిపారు.

రాష్ట్రప్రభుత్వ వ్యాపార అనుకూల విధానాలు, నైపుణ్యం గల మానవ వనరులు, చక్కని మౌలిక సదుపాయాలు గల హైదరాబాద్ సిటీ పెట్టుబడులకు స్వర్గధామం కానున్నదని కనుక అమెరికన్ కంపెనీల వారు ఈ నదవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటూ పెట్టుబడులతో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రత్యేకతను వివరిస్తూ ఈ మహానగరం టెక్నాలజీ హబ్ గానే కాకుండా ఫార్మాసిటీ రంగంలో గ్లోబల్ లీడర్ గా ఉంటుందన్నారు. కరోనా విపత్కర సమయంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, అరబిందో ఫార్మా, బైలాజికల్-ఇ, భారత్ బయోటెక్ వంటి కంపెనీల ఆవిష్కరణలతో "వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ ద వరల్డ్" గా, ఈ నగరం ప్రపంచ ఖ్యాతి గడించిందన్నారు.

ఐటీ అభివృద్ధిలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ ఆవిష్కరణ జరుగుతోందని, ఇక్కడ ఏ.ఐ. తో నిర్వహించే పరిశ్రమలు, ఏ.ఐ. అభివృద్ధి, స్మార్ట్‌స్ట్రక్చర్, గ్రీన్ ఎనర్జీ ఆవిష్కరణలకు పెద్ద పీట వేస్తున్నామని, ఈ విభాగాల్లో ఆసక్తిగల, అనుభవం ఉన్న ప్రపంచవ్యాప్త కంపెనీలకు తెలంగాణ స్వాగతం పలుకుతుందన్నారు.

ఈ సందర్భంగా ఆయన తెలంగాణలో పెట్టుబడులకు గల అవకాశాలను కూడా వివరించారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఇంధన మరియు పారిశ్రామిక విధానాలు రూపొందించడం జరిగిందని, కొత్త ఆవిష్కరణలకు, ఆర్థికాభివృద్ధికి ముఖ్యంగా పునరుత్పాదక విద్యుత్ అభివృద్ధికి ఎక్కువ అవకాశాలుంటాయన్నారు.

హైదరాబాద్ లో ఇప్పటికే ఉన్న అమెరికన్ కంపెనీలకు ఇక్కడ సానుకూల వాతావరణం, నైపుణ్యం గల మానవ వనరులు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీని వృద్ధి చేయడానికి, నిలకడగల అభివృద్ధికి దోహదం చేసే సొల్యూషన్స్ కు ఎక్కువ అవకాశాలున్నాయన్నారు. హైదరాబాద్ లో నైపుణ్యత గల మానవ వనరులకు కొదవలేదని, పర్యావరణహిత పునరుత్పాదక ఎనర్జీ మరియు గ్రీన్ టెక్నాలజీలకు, సంబంధిత పరిశ్రమలకు అవకాశం మెండుగా ఉంటుందన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తో పాటు ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్, స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ ఇంకా ఇతర అధికారులు పాల్గొన్నారు.

మైనెక్స్ 2024 లో గురువారం నాడు (సెప్టెంబర్ 26) ఆయన ఆస్ట్రేలియాకు చెందిన డోపల్ మేర్ కంపెనీ స్టాల్ ను సందర్శించారు. ఈ కంపెనీ రూపొందించిన అత్యాధునిక బొగ్గు మరియు ఓవర్ బర్డెన్ రవాణా బెల్టులను, వాటి పనితీరును పరిశీలించారు. సౌత్ ఆఫ్రికా, స్విజర్లాండ్, గ్యాటిమల వంటి దేశాలలో తమ కంపెనీ బెల్టులతో జరుగుతున్న రవాణా ప్రక్రియను స్టాల్ నిర్వాహకులు వివరించారు.

ప్రధాని మోడీతో తమిళనాడు సీఎం స్టాలిన్ భేటీ..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 : దేశ రాజధాని ఢిల్లీలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఇవాళ ప్రధాని మోడీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, కొత్త ప్రాజెక్ట్‌లు మొదలగు అంశాలపై ప్రధానితో చర్చించారు. దాదాపు 40 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో, సమగ్ర శిక్షా పథకం కింద కేంద్ర నిధులను విడుదల చేయాలని, చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టు తదుపరి దశకు అవసరమైన నిధులను విడుదల చేయడానికి ఆమోదం తెలపాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా తమిళ మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడటానికి వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలని మోడీని అభ్యర్థించారు.

సమావేశం అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ?. ప్రధాని మోడీని కలవడం చాలా ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్రానికి సంబంధించిన ప్రయోజనాల కోసం మూడు అభ్యర్థనలు చేశాను. వీటి గురించి ప్రధానికి వివరణాత్మకంగా అన్ని తెలియజేశాను. మా మధ్య జరిగిన ఈ సంతోషకరమైన సమావేశాన్ని ఉపయోగకరమైన సమావేశంగా మార్చడం ప్రధాని మోడీ చేతుల్లోనే ఉందన్నారు.తాను చేసిన అభ్యర్థనలకు ఆయన అంగీకరిస్తారని ఆశిస్తున్నట్లు స్టాలిన్ విలేకరులతో అన్నారు. ఇదిలా ఉంటే మోడీని కలిసిన తర్వాత, స్టాలిన్, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీని కూడా కలిశారు. సీఎం వివిధ సంక్షేమ పథకాల అమలు కోసం రాష్ట్రానికి పెండింగ్‌లో ఉన్న నిధుల కోసం నిన్న సాయంత్రమే దేశ రాజధానికి చేరుకున్నారు.

చెస్ విజేతలకు రూ.25 లక్షలు ఇస్తాం -సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణపతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.25 లక్షల చొప్పున ప్రోత్సాహకాలను ప్రకటించారు. భారతదేశం తరపున తొలిసారి స్వర్ణపతకాలు సాధించిన క్రీడాకారులు అర్జున్, ద్రోణవల్లి హారిక జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని అభినందించిన సీఎం.. రూ.25 లక్షల చొప్పున నజరానా ప్రకటించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు చదరంగ విజేతలను అభినందించారు.

బాసర మొదటి ఘాట్ వద్ద విషాదం.. గోదావరిలో మునిగి మహిళ మృతి

నిర్మల్ , సెప్టెంబర్ 27 : నిర్మల్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. గోదావరిలో స్నానానికి వెళ్లి ఓ మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే..నిజామాబాద్ జిల్లా ధర్మారగ్రామానికి చెందిన జయ(45) అనే మహిళ బాసం గోదావరి మొదటి ఘాట్ వద్ద స్నానానికి వెళ్లి నీటిలో మునిగి మృతి చెందింది.

మృతురాలు జయకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా, జయ భర్త సంవత్సరం క్రితం మృతి చెందాడు, అత్త మూడు నెలల క్రితం మృతి చెందింది.

ఒకే సంవత్సరంలో కుటుంబంలోని ముగ్గురు సభ్యులు మృతి చెందంటంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. ఇదే సమయంలో మరో మహిళ నీటిలో మునిగిపోతుండగా గమనించిన ఓ భక్తుడు సదరు మహిళను కాపాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఇడి అధికారులు సోదాలు

హైదరాబాద్ సెప్టెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు సోదాలు చేపట్టారు. శుక్రవారం ఉదయం నుంచి జూబ్లీహి ల్స్‌లోని మంత్రి ఇంట్లో తనిఖీలు చేస్తున్నారు. హిమాయత్‌సాగర్‌లోని పొంగులేటి ఫాంహౌస్, ఆయన కుమార్తె, బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో సోదాలు కొనసాగుతున్నాయి. పొంగులేటి కంపెనీ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఇన్‌ఫ్రా కార్యాలయాల్లో కూడా అధికారులు సోదాలు చేపట్టారు. 16 బృందాలుగా డిల్లీ నుంచి వచ్చిన ఇడి అధికారులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో సహా నగరంలో 16 ప్రాంతాల్లో సోదాలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసంలో కూడా అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.కాగా, ఇటీవల నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును దక్కించుకున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణాలపై కాంగ్రెస్ శ్రేణులు, నేతల్లో చర్చ జరుగుతోంది. ఈ దాడులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఏజెన్సీ అధికారులు నిర్వహించిన అంశాలకు సంబంధించినవని తెలుస్తోంది.

ప్రజా కళలు వర్ధిల్లాలి ! ప్రజా సాహిత్యం వర్ధిల్లాలి !

ఆహ్వానము

మంజీరా రచయితల సంఘం

38వ వార్షికోత్సవం

తేది : 29-09-2024, ఆదివారం
స్థలం : విపంచి ఆడిటోరియం, సిద్దిపేట.
ప్రారంభ సభ : ఉ॥ 10.00 గం॥లకు

అధ్యక్షత : శ్రీ కె. రంగాచారి మరసం అధ్యక్షులు
ముఖ్య అతిథి : శ్రీ తన్నీరు హరీష్‌రావు శాసన సభ్యులు, సిద్దిపేట
ప్రారంభోపన్యాసం : శ్రీ కె. శ్రీనివాస్ ప్రముఖ సాహితీ వేత్త, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు
విశిష్ట అతిథి : శ్రీ కె. శివారెడ్డి ప్రఖ్యాత కవి, సరస్వతీ సమ్మాన్ అవార్డ్ గ్రహీత
ఆత్మీయ అతిథులు : శ్రీ రసమయి బాలకిషన్ ప్రముఖ గాయకుడు, మాజీ ఎమ్మెల్యే
: శ్రీదేవి ప్రసాద్ Ex. T.N.G.O's అధ్యక్షులు
: శ్రీ కె. విరాహత్ అలీ T.U.W.J.I.J.U. రాష్ట్ర అధ్యక్షులు
కార్యదర్శి నివేదిక : శ్రీ సిద్ధంకి యాదగిరి మరసం ప్రధాన కార్యదర్శి
ఆత్మీయ సందేశాలు : శ్రీ జి. తిరుపతి రెడ్డి T.P.T.F.
శ్రీ జి. పాపయ్య T.J.A.C
శ్రీ గ్యాదరి పరమేశ్వర్ T.N.G.O's సంఘం అధ్యక్షులు
శ్రీ నాళేశ్వరం శంకరం తెలంగాణ రచయితల సంఘం

మరసం కవుల కవితా సంకలనం
" జోడు పాటలు "
ఆవిష్కరణ

భోజన విరామం
మ॥ 2.00 గం॥లకు
రెండవ సభ
ధాశరథి, ఆరుద్ర, బిరుదురాజు రామరాజుల శతజయంతి సందర్భం
అధ్యక్షత : శ్రీ తైదల అంజయ్య ప్రముఖ కవి
అంశం : ఆరుద్ర సాహితీ స్ఫూర్తి
వక్త : డా॥ శ్రీ నందిని సిధారెడ్డి ప్రఖ్యాత కవి
అంశం : బిరుదురాజు రామరాజు పరిశోధనలు, సాహిత్యం
వక్త : డా॥ ప్రొ॥ శ్రీ కాశీం ప్రముఖ రచయిత, విమర్శకులు
అంశం : ధాశరథి కవితా చైతన్యం
వక్త : శ్రీ దేశపతి శ్రీనివాస్ ప్రముఖ గాయకుడు, కవి, MLC

కవి సమ్మేళనం
సా॥ 5.00 గం॥లకు
నిర్వాహణ : పాన్నాల బాలయ్య, తోట అశోక్, అలాజీపూర్ శ్రీనివాస్

పాల్గొనే కవులు :
నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, కందుకూరి శ్రీరాములు, కొమురవెల్లి అంజయ్య, కె. రంగాచారి, పప్పుల రాజిరెడ్డి, మోతుకూరి అశోక్ కుమార్, అహ్మద్, తైదల అంజయ్య, వేముగంటి మురళీకృష్ణ, మహమూద్ పాషా, పాన్నాల బాలయ్య, నాళేశ్వరం శంకరం, వారాల ఆనంద్, కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, చమన్ సింగ్, యన్. భగవాన్ రెడ్డి, చిలుముల శ్రీనివాస్, తోట అశోక్, గుండం మోహన్‌రెడ్డి, బుచ్చి రాజం రెడ్డి, గంభీరావుపేట యాదగిరి, ఘనపురం దేవేందర్, అహోబిలం ప్రభాకర్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, చెన్న రాజు, కళ్లెం లక్ష్మణ్, పిట్టల మధు, వి. శంకర్, బెల్లంకొండ సంపత్ కుమార్, వనపట్ల సుబ్బయ్య, కొమ్ము బద్దిరాజు, సిద్దెంకి యాదగిరి, బోరెడ్డి మధుసూదన్ రెడ్డి
షేక్ బాబా, అక్కారం సత్తయ్య, జహంగీర్ కళాబృందాలచే పాటలు

అందరూ ఆహ్వానితులే...! - మరసం

రేబిస్ కేసులు భారత్‌లోనే ఎక్కువా?!

రేబిస్ వ్యాధిని నివారించడానికి అనగాహనలు కల్పించడంతో పాటు తీసుకోవలసిన ముందు జాగ్రత్తలను సామాన్య జనానికి వివరించే లక్ష్యంగా 2007 నుంచి ప్రతి ఏట 28 సెప్టెంబర్‌న ప్రపంచ దేశాలు 'ప్రపంచ రేబిస్ దినం' పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రథమ రేబిస్ టీకాను రూపొందించిన ప్రముఖ కెమిస్ట్, మైక్రోబయాలజిస్ట్ 'లూయిస్ పాశ్చర్' వర్ధంతి సందర్భంగా 28 సెప్టెంబర్‌న 'ప్రపంచ రేబిస్ దినం' నిర్వహిస్తున్నాం. సురక్షిత జంతు మరియు మానవ టీకాలు అందుబాటులో ఉన్నందున రేబిస్‌ను నివారించుట చాలా తేలిక అని సభ్య సమాజానికి పిలుపు ఇవ్వడం జరుగుతోంది.

ప్రపంచ రేబిస్ దినం-2024 థీమ్:

'ప్రపంచ రేబిస్ దినం-2024 ' థీమ్‌గా 'రాబిస్ సరిహద్దులను బద్దలుకొడదాం (బ్రేకింగ్ రాబిస్ బౌండరీస్)' అనే అంశాన్ని తీసుకున్నారు. రేబిస్ వ్యాధి పట్ల ప్రజల్లో భయం, తప్పుడు సమాచారం, అవాస్తవ భ్రమలు, దురభిప్రాయాలు అనాదిగా నెలకొని ఉన్నాయి. వీటిని పక్కన పెట్టి రేబిస్ పట్ల వాస్తవ అవగాహన కల్పించి, జంతువులకు (ముఖ్యంగా కుక్కలకు) టీకాలు వేయించి,

(28 సెప్టెంబర్ 'ప్రపంచ రేబిస్ దినం' సందర్భంగా)

రేబిస్‌ను పూర్తిగా నివారించవచ్చని నమ్మకాన్ని కలిగించాలి. రేబిస్ వ్యాధి 99 శాతం ప్రాణాంతకమే అయినా 100 శాతం నివారించదగింది.

2030 నాటి జీరో రేబిస్ మరణాల స్థితి సాధ్యమా !

రేబిస్ పట్ల మనకున్న అవగాహనను సమాజంతో స్పష్టతతో పంచుకోవడం, అన్ని వీధి కుక్కలకు టీకాలు ఇప్పించడం, వీధి కుక్కల జనాభాను నియంత్రించడం, భయాన్ని వీడి రేబిస్‌ను నియంత్రించడం జరగాలి. ఐరాస లక్ష్యాల్లో 2030 నాటికి 'జీరో రేబిస్ మరణాల' స్థాయికి చేరాలని సూచించారు. గ్లోబల్ అలియాన్స్ ఫర్ రేబిస్ కంట్రోల్, డబ్ల్యూహెచ్ఓ, వరల్డ్ ఆర్గనైజేషన్ ఫర్ ఆనిమల్ హెల్త్, యుయస్ సిడిసి సంస్థల సౌజన్యంతో ప్రపంచ రేబిస్ దినం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రేబిస్ వ్యాధితో ఆసియా, ఆఫ్రికా దేశాల్లోనే 95 శాతం మరణాలు నమోదు అవుతున్నాయి. ప్రజల్లో కనీస అవగాహన లేకపోవడంతో పేద దేశాలు రేబిస్ వలలో చిక్కడం కనిపిస్తున్నది. కుక్కలను ఇంటి ఆవరణలకే పరిమితం చేయడం, సాదు కుక్కలన్నింటికీ టీకా వాయించడం, వీధి కుక్కలకు విధిగా టీకా వేయించడం, వీధి శునకాల జనాభాను నియంత్రించడం, కుక్క కాటు వేసిన 15 నిమిషాల్లోపు నీటితో గాయాన్ని శుద్ధి చేయడం, వెంటనే ఆంటీ-రేబిస్ టీకాల పూర్తి డోసులను తీసుకోవడంతో రేబిస్ కారణ మరణాలను నివారించవచ్చు.

భారత్‌లో రేబిస్ స్థితి :

రేపిస్ వ్యాధి 150కి పైగా దేశాల్లో బయట పడుతున్నది. ప్రపంచ రేబిస్ కేసుల్లో 40 శాతం వరకు ఇండియాలోనే కనిపిస్తున్నాయి. రేబిస్ వ్యాధితో ప్రపంచవ్యాప్తంగా 59,000 మంది, భారత్‌లో ప్రతి ఏట కనీసం 20,000 మరణిస్తున్నారు. రేబిస్‌తో మరణించే వారిలో 36-40 శాతం మంది 15 ఏండ్ల లోపువారు కావడం విచారకరం. కుక్క కాటు అతి ప్రమాదకరమని సామాన్యులకు తెలియక నిర్లక్ష్యం చేసి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

అన్ని రకాల కుక్కలకు టీకా ఇప్పించడంతో పాటు కుక్క కరిచిన వ్యక్తి వెంటనే వైద్య సూచనలు పాటిస్తూ టీకాల పూర్తి డోసు తీసుకోవాలి. 100 శాతం నివారించగల రేబిస్ వ్యాధి మన నిర్లక్ష్యంతోనే ప్రాణాంతకంగా మారుతున్నదని తెలుసుకోవాలి. కుక్క కాటుతో మాత్రమే కాకుండా పిల్లులు, గబ్బిలాలు, ముంగిసల కాటు లేదా గీరడం వల్ల కూడా రేబిస్ వస్తుందని మరువరాదు.

ంబిస్ వ్యాధి వల్ల జ్వరం, బలహీనత, తల నొప్పి, ఉద్రేకం, గందరగోళం, మస్తిష్క లోపం, నీటిని చూస్తే అతిగా (హైడ్రోఫోబియా) భయపడడం లాంటి వివిధ రోగ లక్షణాలు కనిపిస్తాయి. భారత్‌లో దాదాపు 40 మిలియన్ల వీధి కుక్కలు ఉండగా, వీటికి టీకా వేయించడం ప్రభుత్వ యంత్రాంగాలకు అతి సవాళుగా నిలుస్తున్నది. దక్షిణ భారతంలో వీధి కుక్కలను పట్టించి దూరంగా వదిలేయడం, విష ప్రయోగం చేయడం లాంటి చర్యలతో వాటి జనాభా పడిపోతున్నది. దేశంలో 70 శాతం మంది రేబిస్ పదాన్ని వినలేదని, 30 శాతం మందికి మాత్రమే కాటు వేసిన చోటును శుభ్రపరచడం గూర్చి తెలుసు అని నిర్ధారించారు.

రేబిస్ పట్ల అవగాహన కల్పించే నిమిత్తం భారత ప్రభుత్వం 'జాతీయ రేబిస్ నియంత్రణ కార్యక్రమాన్ని' తీసుకువచ్చింది. దాదాపు 50 శాతం ప్రభుత్వ వైద్యశాలల్లో రేబిస్ టీకాలు నిలువ లేకపోవడం కూడా మరో సవాళుగా నిలుస్తున్నది. అత్యంత ప్రాణాంతక రేబిస్ పట్ల మౌళిక అవగాహనను కలిగి, రేబిస్ మారణాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం. కుక్క కాటుకు అవగాహనతో చెప్పు దెబ్బ కొడుతూ కుక్క కాటు కారణ మరణాలు లేకుండా చూసుకుందాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

సైబర్ క్రైమ్ బాధితులు ఎక్కువగా ఉన్నత విద్యా వంతులే- టి లక్ష్మి నారాయణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 : సంచలన వార్తలకి ప్రాధాన్యం ఇవ్వకుండా సమాజానికి అవసరమయ్యే వార్తలకు సముచిత స్థానం కల్పిస్తే సమాజంలో మార్పుకు మనం నాంది కావచ్చు. ప్రతీ రోజు నిరంతరం మనం ఏదో ఒక విషయం నేర్చుకుంటూనే ఉన్నాం. మరీ ముఖ్యంగా జర్నలిజంలో నిరంతరం మనల్ని మనం నవీకరించుకోవాలని నల్లగొండ జిల్లా అదనపు పాలనాధికారి శ్రీ పూర్ణ చంద్ర అన్నారు. ఈ రోజు స్థానిక అంబేద్కర్ భవన్ లో జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన వార్తలాప్ - వర్క్ షాప్ లో ముఖ్య అతిథిగా జిల్లా అదనపు పాలనాధికారి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు పాలనాధికారి మాట్లాడుతూ నేడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మనల్ని మనం నవీకరించుకుంటూ , సమాజంలో 4వ స్తంభం గా మీడియా

తన పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తే సమాజంలో మంచి మార్పును మనం చూడవచ్చు. ప్రజాభిప్రాయ ప్రకారం నిజ నిర్ధారణ చేసుకొని వార్తలు రాస్తే బాగుంటుంది. పిఐబి లాంటి కేంద్ర ప్రభుత్వ కార్యాలయం నేడు మన మధ్యకు వచ్చి జిల్లా స్థాయిలో వర్క్ షాప్‌లను నిర్వహిస్తోందని, ఇందుకు పిఐబి బృందాన్ని అభినందిస్తున్నాను.

పోషణ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఫోటో ఎగ్జిబిషన్ మన దైనందిన జీవితంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, మనం తినాల్సిన వాటి గురించి వివరంగా తెలియజేసేలా ఉందని, ఈ ఎగ్జిబిషన్‌ని సాధ్యమైనంత వరకు అందరూ ఒక సారి తిలకించి అవగాహన పెంచుకోవాలని కోరారు.

ఇంతకు ముందు నేరాలలో బాధితులు, నేరస్థులు ఉండేవారు. కానీ ఇప్పుడు సైబర్ క్రైమ్ లో నేరస్థులు ఎక్కడో ఉండి మనకు చేయాల్సిన నష్టం చేస్తూనే ఉంటారు. రాష్ట్రంలో ప్రతీ రోజూ సుమారు రూ.5-6 కోట్ల మధ్య సైబర్ మోసాల వల్ల నష్టపోతున్నారని టి.లక్ష్మి నారాయణ, సైబర్ క్రైమ్ డిప్యూటీ ఎస్పీ అన్నారు.

సైబర్ క్రైమ్ బాధితులు ఎక్కువగా ఉన్నత విద్యా వంతులే, 90 శాతం కి పైగా వారే ఉన్నారు. ప్రతీ జిల్లా లో సైబర్ క్రైమ్ కి సంబంధించి సైబర్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయడం జరిగింది. సైబర్ క్రైమ్ జరిగిన గోల్డెన్ అవర్ లో ఫిర్యాదు చేస్తే మనం సత్వర న్యాయం జరిగేలా చూడవచ్చు,కాలయాపన చేస్తే చాలా వరకు మనం బాధితులకు న్యాయం చేయలేము. ఈ సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పాత్రికేయుల మిత్రులదే. ఔఅభీఖ పోర్టల్ / 1930 ద్వారా సైబర్ మోసాన్ని తెలియజేయవచ్చు.

కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధీనంలోని పత్రికా సమాచార కార్యాలయం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తోందని, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు, మీడియా కు చేరవేయడంలో పత్రికా సమాచార కార్యాలయం ముఖ్య పాత్ర పోషిస్తోందని పి ఐ బి డిప్యూటీ డైరెక్టర్ డా.మానస్ కృష్ణకాంత్ తన స్వాగతోపన్యాసం లో తెలిపారు.

జర్నలిస్టులు నైతిక విలువలు పాటిస్తూ, కచ్చితమైన వార్తలను సేకరించి ప్రజలకు మరిన్ని మంచి వార్తలు అందేలా చూడాలని, మారుతున్న ధోరణులకు అనుగుణంగా మిమ్మల్ని మీరు మార్చుకోవాలని ఈ వర్క్ షాప్ కి వక్త గా హాజరైన శ్రీ దిలీప్ కుమార్ రెడ్డి అన్నారు. వృత్తి ధర్మం పాటించి వార్తలు అందించండి, జర్నలిజానికి పూర్వ వైభవం అందించాల్సిన భాధ్యత మనందరిపైనే ఉందన్నారు.

డిజిటల్ యుగంలో మనం కేవలం వార్తలే కాకుండా మనం వాడే మొబైల్ ఫోన్లు తరచూ అప్డేట్ చేస్తూ ఉండాలని, ఈ సైబర్ యుగంలో మనం డేటా ను సురక్షితంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని గురించి మరో వక్త సి డాక్ సైంటిస్ట్ శ్రీ జగదీప్ బాబు తెలియజేశారు.

పోషణ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ గురించి నల్లగొండ జిల్లా ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీ కోటేశ్వర రావు వివరించారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్ , పత్రికా సమాచార కార్యాలయం అందిస్తోన్న సేవల గురించి ఆయన వివరంగా తెలియజేశారు.

ఈవీఎం వేర్ హౌస్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు , సెప్టెంబర్ 27 : త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవిఎంలు భద్రపరచిన వేర్ హౌస్ ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు. శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం వేర్ హౌస్ లో ఈవీఎంలను భద్రపరచిన తీరును కలెక్టర్ పరిశీలించారు..

ఈవీయం వేర్ హౌస్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సీసీ కెమెరాల నిఘాలో ఈవీఎంలను నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం సంబంధిత రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు.కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ మురళి, తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రెటరీ ఎల్.వి.ప్రసాద్, బీజేపీ స్టేట్ ఎలక్షన్ సెల్ ప్రతినిధి సాయి ప్రదీవ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కె.పుల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సాయి కృష్ణ యాదవ్, బీఎస్పీ ప్రతినిధి లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

నూట నలభై కోట్ల మంది భారతీయుల సమష్టి సంకల్పాన్ని 'మేక్ ఇన్ ఇండియా' చాటి చెబుతోంది: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 : 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి పది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్వాగతించారు. మన దేశాన్ని తయారీకి, నవకల్పనకు పేరెన్నికగన్న దేశంగా తీర్చిదిద్దడానికి 140 కోట్ల మంది భారతీయులు ఉమ్మడిగా సంకల్పించుకోవడాన్ని 'మేక్ ఇన్ ఇండియా' రుజువుచేస్తోందని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా'ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన స్పష్టం చేశారు.

సామాజిక ప్రసార మాధ్యమ వేదిక 'ఎక్స్' లో ప్రధాన మంత్రి ఈ కింది విధంగా ఒక సందేశాన్ని రాశారు:"ఈ రోజున, 'మేక్ ఇన్ ఇండియా 'కు పది సంవత్సరాలు పూర్తి అయిన ఘట్టాన్ని మనం గుర్తుకు తెచ్చుకొంటున్నాం. ఈ ఉద్యమాన్ని ఫలప్రదం చేయడానికి గడచిన పదేళ్ళుగా అలుపెరుగక శ్రమిస్తున్న వారందరికీ నేను అభినందనలు తెలియజేస్తున్నాను. మన దేశాన్ని తయారీ రంగానికీ, నవకల్పనలకు మారుపేరుగా తీర్చిదిద్దడానికి 140 కోట్ల మంది భారతీయులు కలసి సంకల్పం చెప్పుకోవడాన్ని 'మేక్ ఇన్ ఇండియా' కళ్ళకు కడుతున్నది. వివిధ రంగాలలో ఎగుమతులు ఏ విధంగా పెరిగిందీ, సామర్థ్యాలను ఏ స్థాయుల్లో పెంపొందించిందీ, తత్ఫలితంగా ఆర్థిక వ్యవస్థ పటిష్టమైన స్థితికి చేరుకున్నదీ గమనించదగ్గ అంశాలు.

సాధ్యమైనన్ని రకాలుగా 'మేక్ ఇన్ ఇండియా'కు ప్రోత్సాహాన్ని ఇవ్వడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉన్నది. సంస్కరణల మార్గంలో భారతదేశం పురోగతిలో సాగిపోతూనే ఉంటుంది. మనమందరం కలిసికట్టుగా స్వయంసమృద్ధి ('ఆత్మనిర్భర్ భారత్') దిశగా, అభివృద్ధి చెందినటువంటి భారతదేశాన్ని ('వికసిత్ భారత్'ను) ఆవిష్కరించుదాం"

30న ఫార్మాసిస్టు పోస్టులకు జాబ్-మేళా

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఫార్మసీ లో డిప్లొమా, డిగ్రీ, మాస్టర్స్ చేసిన వారికి ఈనెల 30 వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ టి. రాము తెలియచేసారు.

అపోలో ఫార్మసీ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్-మేళాను ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్ ఉద్యోగాలకి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30 వ తేదీన ఉదయం 11 గంటలకు అభ్యర్థులు నేరుగా బాయోడాటా, విద్యార్హతల సర్టిఫికెట్లతొ ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్దకు హాజరు కావాలని అయన ఒక ప్రకటనలో కోరారు.

సియాచిన్ బేస్ క్యాంప్ ను సందర్శించి, సైనికులతో మాట్లాడిన భారత రాష్ట్రపతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 : భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈరోజు సియాచిన్ బేస్ క్యాంప్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సియాచిన్ హిమవర్వతంపై యుద్ధవీరుల స్మారక స్థూపం వద్ద ఆమె నివాళులు అర్పించారు. 1984, ఏప్రిల్ 13న భారత సైన్యం ఆపరేషన్ మేఘదూత్ ప్రారంభించినప్పటి నుంచి అమరులైన సైనికులు, అధికారుల త్యాగానికి గుర్తుగా ఈ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ విధుల్లో ఉన్న సైనికులతో ఆమె సంభాషించారు.

సైనికులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ... సాయుధ దళాల సుప్రీం కమాండర్‌గా వారి గురించి చాలా గర్వంగా భావిస్తున్నాననీ, వారి ధైర్యసాహసాలకు దేశప్రజలంతా సెల్యూట్ చేస్తున్నారని అన్నారు.

1984 ఏప్రిల్‌లో ఆపరేషన్ మేఘదూత్ ప్రారంభమైనప్పటి నుంచి, భారత సాయుధ దళాల వీర సైనికులు, అధికారులు ఈ ప్రాంత రక్షణ కోసం ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తిస్తున్నారని రాష్ట్రపతి కొనియాడారు. వారు తీవ్రమైన ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్నా, ఏమాత్రం చలించకుండా తమ విధుల్ని నిర్వహిస్తున్నారన్నారు. భారీ హిమపాతం, మైనస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రత వంటి క్లిష్ట పరిస్థితులలోనూ వారు పూర్తి అంకితభావం, అప్రమత్తతతో పనిచేస్తున్నారని కితాబిచ్చారు. మాతృభూమి రక్షణ కోసం వారి త్యాగం, సహనం అసాధారణమైనవని పేర్కొన్నారు. భారతీయులందరికీ సైనికుల త్యాగం, ధైర్యసాహసాలు తెలుసునని, దేశమంతా వారిని గౌరవిస్తున్నదని ఆమె అన్నారు.

సంక్షిప్త సందేశ సేవలందించే అధీకృత పంపిణీదారులు యూఆర్ఎల్, ఏపీకే, ఓటీటీ లింక్స్‌ని మాత్రమే అందించాలి: ట్రాయ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 : సంక్షిప్త (ఎస్సెమ్మెస్) సందేశాల దుర్వినియోగాన్ని నిరోధించే దిశగా టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ (ట్రాయ్) ఆగస్టు 20న కొత్త ఆదేశాలను జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం, నిర్ధారణ కాని యూఆర్ఎల్ లు, ఏపీకేలు, ఓటీటీ లింక్స్ ని ఎస్సెమ్మెస్ పంపిణీదారులు బ్లాక్ చేయవలసి ఉంటుంది. ఎస్సెమ్మెస్ సందేశాల్లో భాగంగా ఇకపై పంపే యూఆర్ఎల్ (యూనిఫార్మ్ రిసోర్స్ లొకేటర్స్), ఏపీకే (యాండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్), ఓటీటీ (ఓవర్ ది టాప్) లింక్స్, విధిగా ఆమోదముద్ర పొందినవై ఉండాలని ట్రాయ్ స్పష్టం చేసింది. అక్టోబర్ ఒకటో తేదీకల్లా ఈ ఆదేశాలను అమలు చేయవలసి ఉంటుంది.

యూఆర్ఎల్ కలిగిన సంక్షిప్త సందేశాలను నిరంతరాయంగా అందజేసేందుకు నిర్ధారించిన యూఆర్ఎల్, ఏపీకే, ఓటీటీ లింక్స్ కల జాబితాను అధీకృత ఎస్సెమ్మెస్ పంపిణీదారులు, సంబంధిత యాక్సెస్ ప్రొవైడర్ల పోర్టల్ లో అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. ఇప్పటికే 3,000 మంది అధీకృత ఎస్సెమ్మెస్ పంపిణీదారులు, 70,000 పైగా లింక్స్ ని నిర్ధారించారు. తుదిగడువులోగా నిర్ధారణ జరిగిన జాబితాని సమర్పించని పంపిణీదారులు, యూఆర్ఎల్ లు, ఏపీకేలు, ఓటీటీ లింక్స్ కలిగిన సందేశాలను పంపే వీలుని కోల్పోతారు.

ప్రమాదకర లింక్స్, అనవసర సందేశాల బారి నుండి వినియోగదారులని రక్షించడంతో పాటు, సురక్షితమైన, పారదర్శక కమ్యూనికేషన్ల వ్యవస్థను నెలకొల్పాలన్న ఉద్దేశంతో ట్రాయ్ ఈ చర్య తీసుకుంది. కొత్త ఆదేశాలను పాటించే యాక్సెస్ ప్రొవైడర్లు, అధీకృత ఎస్సెమ్మెస్ పంపిణీదారులు విశ్వసనీయ, సురక్షిత వాతావరణాన్ని కల్పించడంలో భాగస్వాములవుతారు.

అసంఘటిత రంగం కార్మికులకు కనీస వేతనాన్ని పెంచిన కేంద్ర ప్రభుత్వం

-కొత్త వేతనాలు అక్టోబర్ 1 నుంచి అమలు

న్యూఢిల్లీ సెప్టెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్ (విడిఏ)ని సవరించడం ద్వారా కనీన వేతన రేట్లను పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. కొత్త వేతనాలు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి."కార్మికులకు, ప్రత్యేకించి అసంఘటిత రంగంలోని కార్మికులకు మద్దతు ఇచ్చే ఒక ముఖ్యమైన చర్యలో, వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్ (ఎఆం)ని సవరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కనీస వేతన రేట్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరుగుతున్న జీవన వ్యయాన్ని కార్మికులు తట్టుకోవడానికి ఈ సర్దుబాటు ఉద్దేశించబడింది "అని అధికారిక పిఐబి విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.

భవన నిర్మాణం, లోడింగ్ , అన్‌లోడింగ్, వాచ్ అండ్ వార్డ్, స్వీపింగ్, క్లీనింగ్, హౌస్ కీపింగ్, మైనింగ్ , వ్యవసాయం వంటి వివిధ రంగాలలో నిమగ్నమైన కార్మికులు సవరించిన వేతన రేట్ల నుండి ప్రయోజనం పొందుతారు.

కనీస వేతన రేట్లను నైపుణ్యం ఆధారంగా అంటే, నైపుణ్యంగల, నైపుణ్యం లేని, సెమి స్కిల్డ్, హైలీ స్కిల్డ్ గా వర్గీకరించి, అలాగే భౌగోళిక ప్రాంతం ఆధారంగా ఏ,బి,సి అని వర్గీకరించడం జరిగింది.

ఏ గ్రూపులో వచ్చే నిర్మాణం, ఊడ్చే, శుభ్రపరిచే, లోడింగ్ అన్‌లోడింగ్ పనులు చేసే నైపుణ్యంలేని వారికి రోజుకు రూ. 783(నెలకు రూ. 20358), సెమీ-స్కిల్డ్ కార్మికులకు రోజుకు రూ. 868(నెలకు రూ. 22568), ఇక స్కిల్డ్, క్లారికల్, ఆయుధాలు లేని వాచ్ అండ్ వార్డ్స్ కి రోజుకు రూ. 954(నెలకు రూ. 24804), బాగా నైపుణ్యంగల (హై-స్కిల్డ్) ఉద్యోగులకు రోజుకు రూ. 1035(నెలకు రూ. 26910) చొప్పున ఉంటుందని అధికారిక నోటిఫికేషన్ పేర్కొంది.

పారిశ్రామిక కార్మికులకు వినియోగదారుల ధరల సూచికలో ఆరు నెలల సగటు పెరుగుదల ఆధారంగా ఏప్రిల్ 1 ? అక్టోబర్ 1 నుండి అమలులోకి వచ్చే విడిఏని కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రెండుసార్లు సవరిస్తుంది. చివరి సవరణ ఏప్రిల్ 2024లో జరిగింది.

డీఆర్డీవో, ఐఎన్ఏఈ సంస్థల నేతృత్వంలో హైదరాబాద్ లో 11వ ఇంజనీర్ల సదస్సు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 : రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో), భారత జాతీయ ఇంజనీర్ల అకాడమీ (ఐఎన్ఏఈ)ల ఆధ్వర్యంలో ఈ రోజు హైదరాబాద్ లో11వ ఇంజనీర్ల సదస్సు ప్రారంభమయింది. రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో ప్రధానమైన వ్యూహాత్మక అంశాలైన- 3డీర ప్రింటింగ్ విధానంలో రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ, రక్షణ ఉత్పత్తుల్లో టెక్నాలజీలపై లోతైన చర్చలు జరుగుతాయి. డీఆర్డీవోకు చెందిన రక్షణ పరిశోధన అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్డీఎల్) లో నిర్వహిస్తున్న ఈ సదస్సు వేదికగా నూతన సాంకేతికతలు, స్వదేశీ ఉత్పత్తుల సాధనలో తాజా పరిణామాల గురించి చర్చించేందుకు ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ ప్రముఖులు, విద్యావేత్తలు సమావేశమవుతున్నారు.

అణుశక్తి కమిషన్ మాజీ ఛైర్మన్ శ్రీ అనిల్ కాకోద్కర్, డీఆర్డీవో ఛైర్మన్, ప్రభుత్వ రక్షణ పరిశోధన, అభివృద్ధి విభాగం కార్యదర్శి డాక్టర్ వి. కామత్ సంయుక్తంగా ఈ సదస్సుని ప్రారంభించారు. డీఆర్డీఎల్ హైదరాబాద్ డైరెక్టర్ శ్రీ జి.ఏ. శ్రీనివాసమూర్తి, క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల సంస్థ (మిసైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్) డైరెక్టర్ జనరల్ శ్రీ యు. రాజబాబు, ఐఎన్ఏఈ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఇంద్రనీల్ మన్నా కార్యక్రమంలో ప్రసంగించారు.

రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయాలి

ఖమ్మం, సెప్టెంబర్ 27 : (నేటినిజం ప్రతినిధి): ముదిగొండ గ్రామంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ కళాశాల, ఆశ్వారావుపేట విద్యార్థులుగ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు శుక్రవారం నిర్వహించారు.

ఈ సదస్సులో గ్రామంలో వివిధ రైతులు పండించిన పంటల నమునా, పండించే విధానంలో మెలుకువలు, నేలల రకాలు, ఏ నేలలలో ఏ పంటలు పండించాలి, పండించేటప్పుడు ఎదురయ్యే సమస్యలను ఏ విధంగా అధిగమించాలో కళాశాల విద్యార్థులు విశ్లేషణాత్మకంగా రైతులకు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీవో శ్రీధర్, కెవికె వైరా శాస్త్రవేత్తలు డాక్టర్ జెస్సి సునీత, డాక్టర్ ఫణి శ్రీ, జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వి.పవన్ కుమార్, వి.భూమరాజ్, బి.అఖిల్, వై.మణికంఠ, డి.పవన్ కుమార్, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆహ్వానం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
భాషా సాంస్కృతిక శాఖ
సౌజన్యంతో
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
యువకవి
శ్రీ కుడికాల వంశీధర్ రచించిన
లోపలి వాన
కవితాసంపుటి
గ్రంథావిష్కరణ
29-9-2024 ఆదివారం, ఉ॥ 10 గం॥లకు
రవీంద్రభారతి సమావేశ మందిరం
(మొదటి అంతస్తు, హైదరాబాద్.

ముఖ్యఅతిథి
కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత
ఆచార్య ఎన్. గోపి, పూర్వ ఉపకులపతి,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
అధ్యక్షులు
ఆచార్య సూర్య ధనుంజయ్
పూర్వ అధ్యక్షులు, తెలుగు శాఖ
ఉస్మానియా విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథి
డా॥ ఎస్. రఘు, అసిస్టెంట్ ప్రొఫెసర్
తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
గ్రంథ సమాలోచన
డా॥ గిన్నారపు ఆదినారాయణ
తెలుగు అధ్యాపకులు, పీ.జి. కాలేజి, సికింద్రాబాద్
డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (ర)
అధ్యక్షులు
మద్దాళి రఘురామ్
కార్యదర్శి

మూడు 'పరమ్ రుద్ర' సూపర్ కంప్యూటర్లను జాతికి అంకితం చేయనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 : ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సెప్టెంబర్ 26న మహారాష్ట్రలోని పూణేలో పర్యటించనున్నారు. సాయంత్రం 6 గంటలకు, డిస్ట్రిక్ట్ కోర్ట్ మెట్రో స్టేషన్ నుంచి స్వర్గేట్ వరకు నడిచే మెట్రో రైలును ఆయన జెండా ఊపి ప్రారంభిస్తారు. ఆ తర్వాత సాయంత్రం 6:30 గంటలకు రూ.20,900 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులను ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి జాతికి అంకితం ఇస్తారు.

డిస్ట్రిక్ట్ కోర్ట్ నుండి స్వర్గేట్ వరకు పూణే మెట్రో సెక్షన్ ప్రారంభించి పూణే మెట్రో రైలు ప్రాజెక్ట్ (ఫేజ్-1) పూర్తయినట్లు వెల్లడిస్తారు. జిల్లా కోర్టు నుండి స్వర్గేట్ మధ్య అండర్‌గ్రౌండ్ సెక్షన్ వ్యయం దాదాపు రూ.1,810 కోట్లు.

దాదాపు రూ. 2,950 కోట్లతో అభివృద్ధి చేస్తున్న పూణే మెట్రో ఫేజ్-1 స్వర్గేట్-కత్రాజ్ ఎక్స్‌టెన్షన్‌కు కూడా ప్రధాని శంకుస్థాపన చేస్తారు. దాదాపు 5.46 కి.మీల ఈ దక్షిణ విస్తరణ, మార్కెట్ యార్డ్, పద్మావతి, కత్రాజ్ అనే మూడు స్టేషన్లతో పూర్తిగా భూగర్భం ద్వారా సాగుతుంది. భిడే వాడాలో క్రాంతిజ్యోతి సావిత్రిబాయి పూలే మొదటి బాలికల పాఠశాల స్మారకానికి ప్రధాన మంత్రి శంకుస్థాపన చేస్తారు.

సూపర్ కంప్యూటింగ్ టెక్నాలజీ రంగంలో భారతదేశాన్ని స్వావలంబనగా మార్చాలనే తన నిబద్ధతకు అనుగుణంగా, దాదాపు రూ.130 కోట్లు విలువ చేసే మూడు పరమ రుద్ర సూపర్‌కంప్యూటర్‌లను ప్రధాని జాతికి అంకితం చేస్తారు. జాతీయ సూపర్‌కంప్యూటింగ్ మిషన్ (ఎన్ఎస్ఎం) కింద దీనిని దేశీయంగా అభివృద్ధి చేశారు. ఈ సూపర్ కంప్యూటర్‌లు పుణె, ఢిల్లీ, కోల్‌కతాలో శాస్త్రీయ పరిశోధనలను సులభతరం చేసేందుకు వినియోగించనున్నారు. పూణేలోని జెయింట్ మీటర్ రేడియో టెలిస్కోప్ (జీఎంఆర్టీ) ఫాస్ట్ రేడియో బర్స్ట్‌లు (ఎఫ్ఆర్బీలు), ఇతర ఖగోళ దృగ్విషయాలను అన్వేషించడానికి సూపర్ కంప్యూటర్‌ను ప్రభావితం చేస్తుంది. ఢిల్లీలోని ఇంటర్ యూనివర్సిటీ యాక్సిలరేటర్ సెంటర్ (ఐయుఏసి) మెటీరియల్ సైన్స్, అటామిక్ ఫిజిక్స్ వంటి రంగాలలో పరిశోధనలను మెరుగుపరుస్తుంది. ఎస్.ఎన్. కోల్‌కతాలోని బోస్ సెంటర్ ఫిజిక్స్, కాస్మోలజీ, ఎర్త్ సైన్సెస్ వంటి రంగాలలో అధునాతన పరిశోధనలను నిర్వహిస్తుంది.

వాతావరణ రంగ పరిశోధనల కోసం ప్రత్యేకంగా నిర్మించిన 'హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ (హెచ్.పి.సి.)' వ్యవస్థను శ్రీ మోదీ జాతికి అంకితం చేస్తారు. 850 కోట్ల పెట్టుబడితో చేపట్టే ఈ ప్రాజెక్ట్, వాతావరణ సంబంధిత అంశాలలో భారత్ అంచనా సామర్థ్యానికి తార్కాణంగా నిలుస్తోంది. పుణేలోని ఉష్ణమండల వాతావరణ అధ్యయన సంస్థ (ఐఐటిఎం), నోయిడాలోని జాతీయ మధ్యమ స్థాయి వాతావరణ అంచనా సంస్థ (ఎన్సిఎంఆర్డబ్ల్యూఎఫ్)ల్లో స్థాపితమైన ఉన్నతస్థాయి హెచ్.పి.సి. వ్యవస్థలు, అత్యద్భుత కంప్యూటింగ్ సామర్థ్యం కలిగినవి. సౌరశక్తిని స్ఫురణకు తెచ్చే విధంగా ఈ వ్యవస్థలకి 'అర్క', 'అరుణిక' అనే పేర్లు పెట్టారు. ఉష్ణమండల తుఫాన్లు, భారీ వర్షాలు, ఊరుములతో కూడిన గాలివానలు, వడగళ్ళ వాన, తీవ్రమైన ఎండలు, కరువు వంటి ప్రకృతి వివత్తుల గురించి కచ్చితమైన ముందస్తు సమాచారాన్ని ఈ అత్యాధునిక సూక్ష్మ వ్యవస్థలు అందిస్తాయి.

రూ.10,400 కోట్ల విలువైన పెట్రోలియం, సహజ వాయువు రంగానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలను ప్రధాని ప్రారంభించి, జాతికి అంకితం చేస్తారు. ఈ కార్యక్రమాలు శక్తి, మౌలిక సదుపాయాలు, భద్రత, ట్రక్, క్యాబ్ డ్రైవర్ల సౌలభ్యం, క్లీనర్ మొబిలిటీ, స్థిరమైన భవిష్యత్తుపై దృష్టి పెడతాయి.

డ్రైవింగ్‌ను సులభతరం చేసేందుకు, మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్; ఫతేఘర్ సాహిబ్, పంజాబ్; సోంగాఢ్, గుజరాత్; బెలగావి, బెంగళూరు రూరల్, కర్ణాటకలో ట్రక్ డ్రైవర్‌ల కోసం వే సైడ్ ఎమినిటీస్‌ను ప్రధాని ప్రారంభిస్తారు. ట్రక్కర్లు, క్యాబ్ డ్రైవర్లు వారి దూర ప్రయాణాలలో వారి అవసరాలను తీర్చడానికి రూపొందించబడిన సౌకర్యవంతమైన ప్రయాణ విరామం కోసం ఒకే చోట ఆధునిక సౌకర్యాలను అభివృద్ధి చేశారు. సరసమైన బోర్డింగ్, లాడ్జింగ్ సౌకర్యాలు, శుభ్రమైన మరుగుదొడ్లు, సురక్షితమైన పార్కింగ్ స్థలం, ఆహారం, 1,000 రిటైల్ అవుట్‌లెట్లలో సుమారు రూ. 2,170 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో వైఫై, జిమ్ మొదలైనవాటిని అభివృద్ధి చేస్తున్నారు.

ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో పెట్రోల్, డీజిల్, అబెఉ, ఇఎ, అఃఉ, ఇథనాల్ మిళిత పెట్రోల్ (ఈబీపీ) మొదలైన బహుళ ఇంధన ఎంపికలను అభివృద్ధి చేయడానికి, ప్రధాన మంత్రి ఎనర్జీ స్టేషన్‌లను ప్రారంభిస్తారు. స్వర్ణ చతుర్భుజి, తూర్పు-పశ్చిమ, ఉత్తర-దక్షిణ కారిడార్లు, ఇతర ప్రధాన రహదారులపై వచ్చే 5 సంవత్సరాలలో దాదాపు 4,000 ఇంధన కేంద్రాలు సుమారు రూ. 6000 కోట్లతో అభివృద్ధి చేస్తారు. ఇంధనం కావలసిన వినియోగదారులకు ఒకే గొడుగు క్రింద ప్రత్యామ్నాయ ఇంధనాలను అందించడం ద్వారా నిరంతరాయమైన చలనశీలతను అందించడంలో ఎనర్జీ స్టేషన్లు సహాయపడతాయి.

గ్రీన్ ఎనర్జీ, డీ-కార్బొనైజేషన్, నెట్ జీరో ఎమిషన్‌లకు సజావుగా మారడానికి, ఎలక్ట్రిక్ వెహికల్ డ్రైవర్ల శ్రేణి ఆందోళనను తగ్గించడానికి, ప్రధాన మంత్రి 500 ఈవీ ఛార్జింగ్ సౌకర్యాలను దేశానికి అంకితం చేస్తారు. ఇంకా, 10,000 ఈవీ ఛార్జింగ్ స్టేషన్(ఈవీసీఎస్)లను 2025 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.1,500 కోట్లు అంచనా వ్యయంతో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

మహారాష్ట్రలోని మూడింటితో సహా దేశవ్యాప్తంగా 20 లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జి) స్టేషన్లను ప్రధాని జాతికి అంకితం చేస్తారు. సుదూర రవాణా కోసం ఎల్ఎన్‌జి వంటి స్వచ్ఛమైన ఇంధనాన్ని స్వీకరించడాన్ని ప్రోత్సహించడానికి, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 50 ఎల్ఎన్‌జి ఫ్యూయల్ స్టేషన్‌లను ఆయిల్, గ్యాస్ కంపెనీలు సుమారు రూ. 500 కోట్లతో అభివృద్ధి చేస్తాయి.

దాదాపు రూ. 225 కోట్ల విలువైన 1500 ఈ20 (20 శాతం ఇథనాల్ మిశ్రమ) పెట్రోల్ రిటైల్ అవుట్‌లెట్‌లను కూడా ప్రధాని జాతికి అంకితం చేస్తారు.

పర్యాటకులు, వ్యాపార యాత్రికులు, పెట్టుబడిదారులకు షోలాపూర్‌ను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి, కనెక్టివిటీని గణనీయంగా మెరుగుపరిచే షోలాపూర్ విమానాశ్రయాన్ని ప్రధాని ప్రారంభిస్తారు. షోలాపూర్‌లోని ప్రస్తుత టెర్మినల్ భవనం సంవత్సరానికి 4.1 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా పునరుద్ధరించారు.

కేంద్ర ప్రభుత్వ జాతీయ పారిశ్రామిక కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద 7,855 ఎకరాల విస్తీర్ణంలో విస్తారమైన ప్రాజెక్ట్ బిడ్కిన్ ఇండస్ట్రియల్ ఏరియాను ప్రధాని జాతికి అంకితం చేస్తారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌కు దక్షిణాన 20 కిలోమీటర్ల దూరంలో ఇది ఉంది. ఢిల్లీ ముంబై ఇండస్ట్రియల్ కారిడార్ కింద అభివృద్ధి చేసిన ప్రాజెక్ట్, మరత్వాడా ప్రాంతంలో శక్తివంతమైన ఆర్థిక కేంద్రంగా అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.6,400 కోట్లతో 3 దశల్లో అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది.

చెన్నై పోర్టులో రూ.110 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

చెన్నై, సెప్టెంబర్ 27 : దేశవ్యాప్తంగా డ్రగ్స్ వినియోగం బాగా పెరిగిపోతుంది. దీంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్ని రాష్ట్ర సర్కార్‌లకు కీలక ఆదేశాలు జారీ చేసింది. విదేశాల నుంచి అక్రమంగా వస్తున్న డగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని సూచనలు చేసింది. దీంతో దేశంలోని ప్రధాన ఎయిర్‌పోర్టులు, ఓడరేవుల వద్ద కస్టమ్స్ అధికారులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. డౌట్ వచ్చిన ప్రతి లాగేజీలు, కంటైనర్లను మొత్తం చెక్ చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఈ రోజు తెల్లవారుజామున చెన్నై పోర్టులో కస్టమ్స్ అధికారులు భారీ మొత్తంలో డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఓ ముఠా కంటైనర్‌లో అక్రమంగా విదేశాలకు తరలిస్తున్న దాదాపు 110 కోట్ల రూపాయల విలువైన నిషేధిత డ్రగ్స్‌ను కస్టమ్స్ అధికారులు గుర్తించారు. వాటిని సీజ్ చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రికార్డు స్థాయిలో 1132.92 ఎల్ఎంటి గోధుమ ఉత్పత్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 : వ్యవసాయం, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ 2023-24 సంవత్సరానికి ప్రధాన వ్యవసాయ పంటల ఉత్పత్తి తుది అంచనాలను విడుదల చేసింది. ఈ అంచనాలు ప్రాథమికంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి అందిన సమాచారం ఆధారంగా రూపొందించారు. రిమోట్ సెన్సింగ్, వీక్లీ క్రాప్ వెదర్ వాచ్ గ్రూప్, ఇతర ఏజెన్సీల నుండి అందుకున్న సమాచారంతో పంట ప్రాంతాన్ని ధ్రువీకరించి లెక్కగట్టారు. పంట దిగుబడి అంచనాలు ప్రధానంగా దేశవ్యాప్తంగా నిర్వహించే పంట కోత ప్రయోగాల (సీసీఈలు) ఆధారంగా ఉంటాయి. 2023-24 వ్యవసాయ సంవత్సరాల్లో ప్రధాన రాష్ట్రాల్లో రూపొందించిన డిజిటల్ జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సర్వే (డీజీసీ ఈసీఎస్) ప్రారంభించి సీసీఈలను రికార్డ్ చేసే ప్రక్రియ మళ్లీ రూపొందించారు. దిగుబడి అంచనాల పారదర్శకత, పటిష్టతను ఈ కొత్త విధానం నిర్ధారిస్తుంది.

2023-24లో దేశంలో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 3322.98 ఎల్ఎంటిగా అంచనా వేశారు. ఇది 2022-23లో సాధించిన 3296.87 ఎల్ఎంటి ఆహార ధాన్యాల ఉత్పత్తి కంటే 26.11 ఎల్ఎంటి అధికంగా ఉంది. బియ్యం, గోధుమలు, శ్రీ అన్న మంచి ఉత్పత్తి కారణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగింది.

2023-24లో మొత్తం బియ్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో 1378.25 ఎల్ఎంటిగా అంచనా వేశారు. ఇది మునుపటి సంవత్సరం బియ్యం ఉత్పత్తి అయిన 1357.55 ఎల్ఎంటి కంటే 20.70 ఎల్ఎంటి ఎక్కువ. 2023-24లో గోధుమ ఉత్పత్తి రికార్డు స్థాయిలో 1132.92 ఎల్ఎంటిగా అంచనా వేయగా, ఇది మునుపటి సంవత్సరం గోధుమ ఉత్పత్తి 1105.54 ఎల్ఎంటి కంటే 27.38 ఎల్ఎంటి అధికం. అలాగే గత ఏడాది శ్రీ అన్న ఉత్పత్తి 173.21 ఎల్ఎంటితో పోలిస్తే 175.72 ఎల్ఎంటి గా అంచనా వేశారు. 2023-24లో, మహారాష్ట్రతో సహా దక్షిణాది రాష్ట్రాల్లో కరువు లాంటి పరిస్థితులు ఉన్నాయి. ఆగస్టులో ముఖ్యంగా రాజస్థాన్‌లో చాలా కాలం వర్షాలు లేని పరిస్థితి ఉంది. కరువు వల్ల తేమ ఒత్తిడి రబీ సీజన్‌పై కూడా ప్రభావం చూపింది. ఇది ప్రధానంగా పప్పుధాన్యాలు, ముతక తృణధాన్యాలు, సోయాబీన్, పత్తి ఉత్పత్తిని ప్రభావితం చేసింది.

దసరా తర్వాత కుంకీలు రాక .. కర్ణాటక సిఎంకు పవన్ థ్యాంక్స్

-కర్ణాటకతో ఏపీ ఒప్పందం

-ఆరు అంశాలపై ఇరు అటవీశాఖలు సంతకాలు

అమరావతి, సెప్టెంబర్ 27 : పంట పొలాలపై ఏనుగుల దాడులను నిరోధించేందుకు కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలనే ఏపీ సర్కారు ఓ కొలిక్కి వచ్చింది. కర్ణాటక, ఏపీ ప్రభుత్వాల మధ్య విజయవాడలో ఒప్పందం కుదిరింది. ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు, అటవీశాఖ అధికారుల మధ్య ఆరు అంశాల పత్రాలపై శుక్రవారం సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏపీ నుంచి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కర్ణాటక మంత్రి ఈశ్వర్ కండ్రే, ఇరు రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పంట పొలాలను ఏనుగులు విధ్వంసం చేస్తున్నాయని.. గిరిజన ప్రాంతాలలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

ఈ విషయాలను సీఎం చంద్రబాబుకు కూడా వివరించానన్నారు. కర్ణాటకలో కుంకీ ఏనుగులతో ఏనుగుల దాడిని నివారించవచ్చని గుర్తించామన్నారు. సీఎం ఆదేశాలతో కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు చేశానని.. విధాన్ సౌధకు వెళ్లి అక్కడ అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడినట్లు చెప్పారు. సీఎం సిద్దరామయ్యను కూడా కలిసి కోరగానే మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు.

దసరాకు కుంకీలు రెడీ

అటవీశాఖలో ఇరు రాష్ట్రాల మధ్య ఎం.ఓ.యూలు తీసుకోవడం ఇదే ప్రథమమన్నారు పవన్ . ఆరు అంశాలపై ఈ ఒప్పందాలు నేడు చేసుకున్నామని, మనకు ఏనుగులు సంఖ్య ఎక్కువ.. వాటిని ఎలా ఎదుర్కోవాలని ఆలోచన చేశామన్నారు. . మావటీలు, కావటీలకు శిక్షణ, సామర్థ్యం పెంచేలా ఏనుగుల శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. . కుంకీ ఏనుగులను దసరా తర్వాత ఇక్కడకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. మానవ ఏనుగుల సంఘర్షణ తగ్గించేందుకు కుంకీ ఏనుగులను వినియోగిస్తామన్నారు.

ఏనుగు శిబిరాల సంరక్షణకు పోషకాహారం, ఆరోగ్యం కోసం నాలెడ్జ్ ట్రాన్స్ పర్స్ అందిస్తాం. ఇంటర్ స్టేట్‌ల కోఆర్డినేషన్ ల ద్వారా ఎర్రచందనం, శ్రీగంధం చందనం స్మగ్లింగ్‌ను అడ్డుకుంటామన్నారు. ఇలాంటి ఎం.ఓయూ గత వైసీపీ ప్రభుత్వం చేసి ఉంటే? తరలిపోయిన ఎర్ర చందనం మనకు తిరిగి వచ్చేది" అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

కర్ణాటక ఐటీ వనితీరు అద్భుతం..

కర్ణాటకలో ఐటీ పనితీరు చాలా అద్భుతంగా ఉందని పవన్ కొనియాడారు. ఒక చెట్టు పడిపోయినా, ఆక్రమణలు గుర్తైనా వెంటనే యాప్‌లో చూసే వీలుందన్నారు. ఆ టెక్నాలజీని కూడా రాష్ట్రానికి తీసుకువస్తున్నామని తెలిపారు. కర్ణాటకలో ఎకోటూరిజం ద్వారా ఉద్యోగాలు ఎక్కువ అని.. చంద్రబాబు కూడా దీనిపై ఇప్పటికే చర్చించారన్నారు. అక్కడ పని విధానాన్ని పరిశీలించి.. ఇక్కడ కూడా అమలు చేస్తామని వెల్లడించారు. రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు ఆధ్వర్యంలో వీటి అమలు పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఈ ఎం.ఓయూని ముందుకు తీసుకు వెళ్లడానికి స్వాతంత్ర్య సమరయోధుడు భీమన్న కుమారుడు కీలకంగా వ్యవహరించారని చెప్పారు.

సీఎం సిద్ద కు పవన్ థ్యాంక్స్

కర్ణాటకలో కాంగ్రెస్, ఏపీలో కూటమి ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. రెండు విభిన్న ప్రభుత్వాలు ఉన్నా.. ఈ ఒప్పందాలు ప్రజల అవసరాల కోసం చేసుకున్నామని తెలిపారు పవన్. పార్టీలు వేరైనా.. ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చినందుకు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఈశ్వర్ కండ్రేకు ధన్యవాదాలు తెలియజేశారు. కోట్ల విలువైన ఎర్ర చందనం ఏపీ నుంచి రవాణా చేస్తుండగా కర్ణాటకలో పట్టుకున్నారన్నారు. తమిళనాడు ప్రభుత్వంతో కూడా మాట్లాడి? ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా నిరోధిస్తామని పవన్ స్పష్టం చేశారు.

ఇందిరాగాంధీ కూడా డిక్లరేషన్ ఇచ్చారు.. అంతకంటే గొప్పోడివా - జగన్ కు ఆరణి కౌంటర్

అమరావతి, సెప్టెంబర్ 27 : గత ప్రభుత్వం తిరుమల ప్రసాదాన్ని అపవిత్రం చేసిందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. జగన్ తిరుమల రాకను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకునే అర్హత జగన్‌కు లేదని తెలిపారు. జగన్ కూడా డిక్లరేషన్ ఇచ్చి దర్శనానికి వెళ్లాలని డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ, అబ్దుల్ కలామ్ డిక్లరేషన్ ఇచ్చారని గుర్తుచేశారు. కాగా, జగన్ పర్యటనను నిరసిస్తూ ప్లకార్డులతో శాంతియుతంగా నిరసన తెలుపుతామని ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రధాన కూడళ్లలో బ్యానర్లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఐదేళ్లలో ఆలయాలను అపవిత్రం చేశారని విమర్శించారు.

జగన్ పర్యటనను అడ్డుకోం : కూటమి నేతలు

మరోవైపు మాజీ సీఎం వైఎస్ జగన్ తిరుమల పర్యటనను అడ్డుకోవద్దని ఎన్డీయే కూటమి నేతలు నిర్ణయించారు. తిరుపతిలో శుక్రవారం సమావేశమైన ఎన్డీయే కూటమి నేతలు.. జగన్ వెళ్లే దారిలో శాంతియుతంగా నిరసన తెలపాలని నిర్ణయించుకున్నారు. శ్రీవారి లడ్డూ కల్తీకి జగనే కారణమని ఈ నిరసన చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. ఒకవేళ వైసీపీ రాజకీయ బల ప్రదర్శనకు దిగితే మాత్రం దీటుగా సమాధానం చెప్పాలని ప్లాన్ చేసుకున్నారు.

ప్రజల నిరంతర క్రియాశీల భాగస్వామ్యంకోసం కృషి చేస్తున్న కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 : ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోం , సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో స్వచ్ఛ భారత్ అభియాన్‌కు కట్టుబడి వున్నామని కేంద్ర హోం, సహకార రంగాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. స్వచ్ఛ భారత్ అభియాన్ కింద పరిసరాల పరిశుభ్రత, ప్రజల నిరంతరం క్రియాశీలక భాగస్వామ్యంకోసం కేంద్ర హోంశాఖ పలు విధాలుగా కృషి చేస్తోంది. ఈ ప్రయత్నాలలో భాగంగా, సెక్రటరీ (బోర్డర్ మేనేజ్‌మెంట్) శ్రీ రాజేంద్ర కుమార్ నార్త్ బ్లాక్‌లోని హోం మంత్రిత్వ శాఖ అధికారులు, ఉద్యోగులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞను చేయించారు.

నార్త్ బ్లాక్ ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రత కోసం హోం మంత్రిత్వ శాఖ అధికారులు, ఉద్యోగులు శ్రమదానం చేశారు. స్వచ్ఛ భారత్ అభియాన్ కింద పరిసరాల పరిశుభ్రత, ప్రజల క్రియాశీల భాగస్వామ్యంకోసం కేంద్ర హోంశాఖ చేస్తున్న అనేక కార్యక్రమాలలో ఇది ఒకటి.

ఈ సందర్భంగా చేసిన స్వచ్ఛతా ప్రతిజ్ఞ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరింది. వ్యర్థాలను బాధ్యతాయుతంగా పారవేయడాన్ని ప్రోత్సహించింది. నిత్య జీవితంలో సుస్థిర పద్ధతుల ప్రాముఖ్యతను ప్రత్యేకంగా చాటింది.

ఈ సందర్భంగా, కేంద్ర హోం శాఖలోని అధికారులు, ఉద్యోగులందరూ వారి వ్యక్తిగత , వృత్తి జీవితంలో స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమ అమలు కోసం కృషి చేయాలని బార్డర్ మేనేజ్ మెంట్ కార్యదర్శి కోరారు.

క్లీన్, గ్రీన్ ఇండియా విజన్‌కు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని, పరిశుభ్రత, సుస్థిరత పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లో బాధ్యతను పెంపొందించే కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొంటున్నదని ఆయన అన్నారు.

స్వచ్ఛ భారత్ అభియాన్ పట్ల తమ నిబద్ధతను ప్రదర్శిస్తూ, కేంద్ర హోంశాఖకు చెందిన అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పరిశుభ్రతా కార్యక్రమాలలో పాల్గొని కార్యాలయ ఆవరణలోని చెత్తా చెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి వ్యక్తికి వుండాల్సిన బాధ్యతను తెలియజేసేలా సామూహిక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.

హోం శాఖ అధికారులు, ఉద్యోగులు పర్యావరణ పరిరక్షణ, హరిత భవిష్యత్తు పట్ల తమ అంకితభావాన్ని ప్రదర్శించారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే ఉద్యమ స్ఫూర్తితో నార్త్ బ్లాక్ పార్క్‌లో మొక్కలు నాటారు.

ప్రియుడిపై ప్రియురాలు దూషనాలు..దెబ్బతిన్న ప్రియుడి ఆత్మాభిమానం

-ప్రియురాలిని 59 ముక్కలుగా నరికి చెట్టుకు ఉరేసుకున్న ప్రియుడు



బెంగళూరు సెప్టెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ప్రియుడిపై ప్రియురాలు దాడి చేయడంతో పాటు అతడిని పరుషమైన పదజాలంతో దూషించడంతో ఆత్మాభిమానం దెబ్బతింది. ఘర్షణ తారాస్థాయికి చేరుకోవడంతో ఆమెపై దాడి చేసి గొంతు నులిమి చంపేశానని నిందితుడు సూసైట్ లేఖలో వివరించాడు. అనంతరం మృతదేహాన్ని స్నానపు గదిలో తీసుకెళ్లి శరీర భాగాలను ముక్కలు ముక్కలు చేసి ఫ్రిజ్ లో భద్రపరిచానని, వాసన రాకుండా రసాయనాలతో పిచికారి చేశానని తెలిపాడు. నిందితుడు బెంగళూరు నుంచి ఒడిశాలోని తన సొంతూరుకు వెళ్లిన తరువాత గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం?. బెంగళూరులో మహాలక్ష్మి మర్డర్ కేసు సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఒడిశాకు చెందిన ముక్తి రంజన్ రాయ్, నేపాల్ కు చెందిన మహాలక్ష్మి అనే యువతి, యువకుడు ఒకే కంపెనీలో పని చేయడంతో ప్రేమకు దారి తీసింది. వయ్యాలికావల్ లో మునేశ్వర్ బ్లాక్ లో ఇల్లు అద్దెకు తీసుకొని ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. రాయ్ గత కొన్ని రోజుల నుంచి మరో అమ్మాయితో చనువుగా ఉండడంతో ఇద్దరు మధ్య గత కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 21 రాయ్ తో మహాలక్ష్మి ఆమె గొడవ పడింది. ఇద్దరు మధ్య గొడవ తారాస్థాయికి చేరుకోవడంతో అతడిపై ఆమె దాడి చేసింది. పరుషమైన పదజాలంతో ఆమె దూషించడంతో అతడు తట్టుకోలేకపోయాడు. ఆమెపై దాడి చేసి గొంతు నులిమి చంపేశాడు.

ఎపిలో రాక్షస రాజ్యం ..దేవుడిని దర్శనానికి ఆటంకాలే - జగన్

అమరావతి, సెప్టెంబర్ 27 : ఎపిలో ప్రస్తుతం రాక్షసరాజ్యం నడుస్తున్నదని, కనీసం దేవుడి దర్శనం చేసుకునే పరిస్థితులు కూడా అక్కడ లేవని మండిపడ్డారు వైసిపి అధినేత,మాజీ ముఖ్యమంత్రి జగన్.. తన రాజకీయ జీవితంలో ఇంత దుర్మార్గమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని అన్నారు. . మాజీ ముఖ్యమంత్రి అయిన తాను తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి వెళుతుంటే అడ్డుకునే ప్రయత్నం చేశారని అన్నారు.

అమరావతిలోని తన నివాసంలో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, దేవుడి దగ్గరకు వెళుతుంటే అడ్డుకునే కార్యక్రమాన్ని ఎప్పుడూ చూడలేదని చెప్పారు. జగన్ తో పాటు వెళ్లేందుకు అనుమతి లేదంటూ వైసీపీ నేతలకు నోటీసులు ఇచ్చారని దుయ్యబట్టారు. ఇది రాక్షస రాజ్యం కాదా అని ప్రశ్నించారు. లడ్డూ అంశాన్ని డైవర్ట్ చేసేందుకే ఇలా చేస్తున్నారని అన్నారు. వంద రోజుల ప్రభుత్వ పాలన వైఫల్యాల నుంచి ప్రజలను డైవర్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

తిరుమలలో తన పర్యటనను అడ్డుకునేందుకు తిరుపతికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా బీజేపీ శ్రేణులను పిలిపించారని ఇది బీజేపీ పెద్దలకు తెలుసో తెలియదో అని జగన్ చెప్పారు.

తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అడ్డగోలుగా తప్పుడు ప్రచారం చేసి దేవుడి పవిత్రతను దెబ్బతీశారని దుయ్యబట్టారు. రాజకీయ దురుద్దేశంతోనే జంతు కొవ్వు కలిసిందని ప్రచారం చేశారని అన్నారు. తిరుమల లడ్డూ విశిష్టతను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు అబద్ధాలను ఆధారాలతో సహా నిరూపిస్తామని చెప్పారు.

'జంతువుల కొవ్వుతో ప్రసాదాలు చేశారని అబద్ధాలు చెబుతున్నారు. అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆధారాలు చూపిస్తాం. టిటిడి లో 6 నెలలకు ఒకసారి టెండర్లు పిలవడం దశాబ్దాలుగా జరుగుతున్నదే. తక్కువ రేటుకు కోట్ చేసిన వారికి టెండర్ ఖరారు చేస్తుంది. దశాబ్దాలుగా జరుగుతున్న కార్యక్రమాన్ని వివాదాస్పదం చేస్తున్నారు. తిరుమలకు వచ్చిన నెయ్యిని మూడు సార్లు పరీక్షిస్తారని జగన్ అన్నారు. "జులై 6, 12 తేదీల్లో నాలుగు ట్యాంకర్లు వచ్చాయి. ఆ నాలుగు ట్యాంకర్లు టెస్టులు ఫెయిల్ అయ్యాయి. టెస్టులు ఫెయిల్ అయిన 4 ట్యాంకర్లను వెనక్కి పంపారు. టెస్ట్‌లు ఫెయిల్ అయితే మైసూర్ ల్యాబ్‌కు పంపుతారు.. కానీ తొలిసారి ఈ శాంపిల్స్‌ను గుజరాత్‌కు పంపారు. ట్యాంకర్లను వెనక్కి పంపి సదరు కంపెనీకి నోటీసులు ఇచ్చారు.

తెలంగాణ ఉద్యమంలో కొండ బాపూజీ లక్ష్మణ్ ది కీలక పాత్ర..

ఆదిలాబాద్, సెప్టెంబర్ 27 : స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు, స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉన్న బాపూజీ విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిర్మల్ జిల్లా పద్మశాలి సంఘ సభ్యులు, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వరప్ప పలువురు నాయకులతో కలిసి బాపూజీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సంఘ సభ్యులు, నాయకులు, తదితరులు ఉన్నారు.

బ్రిటీష్ కౌన్సిల్ సహకారంతో 'విమెన్ ఇన్ స్పేస్' కార్యక్రమాన్ని ప్రారంభించిన శాస్త్ర సాంకేతిక విభాగం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 : భారత్-బ్రిటన్ ఉమ్మడి విద్యా పరిశోధనా కార్యక్రమం (యూకేఐ ఈఆర్ఐ)'లో భాగంగా, ఈ నెల 24న 'విమెన్ ఇన్ స్పేస్ లీడర్షిప్' కార్యక్రమాన్ని కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం (డీఎస్టీ), బ్రిటీష్ కౌన్సిల్ సహకారంతో ప్రారంభించింది.

ఖగోళశాస్త్ర రంగంలో మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకూ, వారికి సమాన భాగస్వామ్యాన్ని అందించేందుకూ అనువైన వ్యూహాత్మక నాయకత్వ వ్యవస్థను ఏర్పరచడంపై ఈ కార్యక్రమం దృష్టి సారిస్తుంది. ఈ దిశగా వివిధ సంస్థలకు బ్రిటీష్ కౌన్సిల్ సహకారాన్ని అందిస్తుంది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు కోవెంట్రీ విశ్వవిద్యాలయం కూడా సహకరిస్తోంది.

"ఖగోళశాస్త్ర రంగంలో పురుషులతో పాటు స్త్రీలకు సమానత్వాన్ని కల్పించాలన్నది ఈ పథకం ముఖ్యోద్దేశంగా ఉంది. పటిష్ఠమైన నాయకత్వ పద్ధతులను నెలకొల్పడం ద్వారా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధన, సృజనాత్మకతల్లో తమ వంతు పాత్ర పోషించేందుకు మహిళలకు అవకాశం లభిస్తుంది" అని డీఎస్టీ 'హెడ్ ఆఫ్ విమెన్ ఇన్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-కిరణ్' విభాగాధిపతి డాక్టర్ వందనా సింగ్ పేర్కొన్నారు.

బ్రిటీష్ కౌన్సిల్ భారత శాఖ డిప్యూటీ డైరెక్టర్ మైఖేల్ హోల్లేట్ మాట్లాడుతూ... ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పరస్పర సహకారం అవసరమని చెబుతూ, శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్, గణితశాస్త్ర రంగాల్లో మహిళల పాత్ర పెరగవలసిన అవసరముందని చెప్పారు.

సంస్కృతిని కేవలం ప్రతిబింబించడం వరకే కాక, దానిని మార్చగలిగే శక్తిగల మహిళల గురించి అన్వేషించాలని బ్రిటన్ కోవెంట్రీ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ ఎలెనా గౌరా అభిప్రాయపడ్డారు. పరిశోధనా రంగం ప్రారంభ దశలో సేవలందిస్తున్న 250 మందిని ఎంపిక చేసి, వారిలో నాయకత్వ లక్షణాలను పాదుకొల్పడం, లింగ వివక్షను ఎదుర్కొనే పద్ధతుల పట్ల అవగాహన కల్పించి, మద్దతు బృందాన్ని ఏర్పరచడం కార్యక్రమం లక్ష్యం.

భారత ఖగోళరంగ సంస్థ 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్' డైరెక్టర్, ప్రొఫెసర్ అన్నపూర్ణి సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ... ఇంజనీరింగ్, సామాజిక శాస్త్రం సహా అనేక రంగాలకు విస్తరిస్తున్న అంతరిక్ష రంగంలోకి మహిళలు తొలిదశలోనే అడుగుపెట్టాలని సూచించారు.

ఖగోళశాస్త్ర రంగంలో మహిళలకు సమానావకాశాలను కల్పించేందుకు అనుసరించదగ్గ జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలను విద్యావేత్తలు, విధానకర్తలతో కూడిన ప్రతినిధులు, ఇందుకోసం ఏర్పాటు చేసిన కార్యశాలలో చర్చించారు.

ఆస్ట్రోఫిజిక్స్, టెలీ కమ్యూనికేషన్ల వంటి కీలక రంగాల్లో స్త్రీపురుష సమానత్వాన్ని నెలకొల్పడం ద్వారా ఆయా రంగాల్లో సృజనాత్మకను పెంచడం, అవసరమైన బోధనా వ్యవస్థలను నెలకొల్పడం ఈ కార్యక్రమ లక్ష్యాలుగా ఉన్నాయి.

సీఎంఆర్ వస్త్రాలయం మరో అద్భుతం..

-ఇందూర్ లో సందడి చేసిన సినీ తారలు..
-ప్రముఖ సినీహీరో రామ్.. సినీతార కుమారి పాయల్ రాజ్ పూత్ లు..
-సెల్ఫీలతో పోటీపడిన అభిమానులు..
-సినీ తారల చిత్రాలను సెల్ ఫోన్ లో బందిస్తూ..సందడి..
-అట్టహాసంగా ప్రారంభమైన కానున్న సీఎంఆర్ వస్త్రాలయం.

నిజామాబాద్, సెప్టెంబర్ 27: మహిళలకు ప్రత్యేక డిజైన్లలో సరసమైన ధరలతో అన్ని రకాల రంగులతో వస్త్రాలను ఏర్పాటు చేసిన సిఎంఆర్ చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మరో అద్భుత ఒడిశా రాష్ట్రాలలో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సి.ఎం.ఆర్. టెక్స్టైల్స్ జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్, సి.ఎం.ఆర్. షాపింగ్ మాల్ అట్టహాసంగా ప్రారంభించారు.

నిజామాబాద్ నగరంలోని హైదరాబాద్ రోడ్ వద్ద సర్వాంగా సుందరంగా రూపుదిద్దుకున్న సీఎంఆర్ వస్త్రాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ నిజామాబాద్, నగర మేయర్ దండు నీతు కిరణ్ ,45వ డివిజన్ కార్పొరేటర్.. ఆకుల హేమలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీ ధర్మపురి అరవింద్ సీఎంఆర్ వస్త్రాలయాన్ని ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ సినీ హీరో రామ్ పోతినేని, ప్రముఖ సినీతార కుమారి పాయల్ రాజ్ పూత్ లు సిఎంఆర్ షాపింగ్ మాల్ లో సందడి చేశారు.

సెల్ఫీలతో పోటీ పడ్డ అభిమానులు..

సీఎంఆర్ వస్త్రాలయ ప్రారంభోత్సవానికి హాజరైన సినీ తారల రాకతో ఇందూర్ సందడిమయమైంది. సినీ తారల చిత్రాలను అభిమానులు సెల్ఫీల్లో బంధిస్తూ.. హీరో హీరోయిన్ల తో సెల్ఫీలు దిగడానికి అభిమానులు పోటీపడ్డారు. సినీ తారలను చూడడానికి సిఎంఆర్ షో రూం కి తండోపతండాలుగా ప్రజలు తరలివచ్చారు.

తెలంగాణ సాహితి

యూత్ లిటరరీ ఫెస్ట్ - 2024

కథ | నవల | కవిత్వం | పాట | విమర్శ

04 అక్టోబర్ 2024 - 05 అక్టోబర్ 2024
ఉదయం 10 గంటల నుంచి..

సంప్రదించాల్సిన నెంబర్లు :
88977 65417, 9642570294

- సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్

న్యూఢిల్లీలో స్వచ్ఛతా హీ సేవలో శ్రీ అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 : కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ స్వచ్ఛతా హీ సేవ, 2024 ప్రచారంలో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) న్యూఢిల్లీలోని సూచనా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించే వివిధ కార్యక్రమాలలో కూడా పాల్గొన్నారు.

సూచనా భవన్‌లో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అధికారులు, సిబ్బందితో అశ్విని వైష్ణవ్ ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో పాల్గొన్నవారు వారి ప్రాంతాల్లో, ప్రభావిత రంగాలలో పరిశుభ్రత, సుస్థిర పద్ధతులను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉన్నామని ప్రతిజ్ఞ చేశారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరుతో ఒక మొక్క నాటడం) ప్రచారానికి కొనసాగింపుగా, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ అనే ఇరు లక్ష్యాలను మిళితం చేస్తూ శ్రీ అశ్విని వైష్ణవ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్యోగులకు మొక్కలు పంపిణీ చేసి పర్యావరణం పట్ల వ్యక్తిగత బాధ్యతను తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి శ్రీ ఎల్ మురుగన్, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్ పర్సన్, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అధికారులు, ఇతర విభాగాల మీడియా అధిపతులు, అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభిమానుల అత్యుత్సాహం - తగలబడిన ఎన్టీఆర్ భారీ కటౌట్

-ఆర్టీసీ క్రాస్ రోడ్ సుదర్శన్ థియేటర్ వద్ద ఘటన
-అభిమానుల కాల్చిన టపాసులుతో ప్రమాదం

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : ఎట్టకేలకు అనేక రిలీజ్ వాయిదాల తర్వాత దేవర వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయింది. దింతో ఫ్యాన్స్ సంబరాలు ఆకాశాన్ని తాకాయి. ఈలలు, గోళాలు, టపాయకాయలు, డిజె సౌండ్స్ తో థియేటరలు మోత మోగిపోయాయి. ఇది ఇలా ఉంటే హైదరాబాద్ లోని ఆర్టీసీ క్రాస్ రోడ్ లో పేరొందిన థియేటర్ సుదర్శన్ 35 ఎం ఎం లో దేవర కు కేటాయించారు. నిన్న రాత్రి నుండి భారీ కటౌట్ లు ఏర్పాటు చేసి పాలాభిషేకాలు, బాణాసంచాలతో అభిమానులు ఎన్టీయార్ పాటలతో హోరెత్తించారు. కాగా తెల్లవారు జామున నుండి షోస్ స్టార్ట్ చేసారు. ఈ నేపథ్యంలో ఉదయం ఆట ముగిసాక సినిమా సూపర్ హిట్ టాక్ రావడంతో ఫ్యాన్స్ భారీ ఎత్తున బాణాసంచా కాల్చి సక్సెస్ ను సెలెబ్రేట్ చేసుకున్నారు.

ఈ క్రమం లో నిప్పు రవ్వ పక్కనే ఉన్న ఎన్టీయార్ కటౌట్ పై పడింది. చెక్క కటౌట్ కావడంతో నిప్పు రవ్వ పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే ఎన్టీయార్ కటౌట్ పూర్తిగా తగలబడింది. దీంతో బయాందోళకు గురైన ప్రేక్షలులు పరుగులు తీసారు. ఫ్యాన్స్ మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా అదుపులోకి రాలేదు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే వచ్చిన సిబ్బంది మంటలు ఆర్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బండ్లగూడ జాగీర్ పీరాన్ చెరువులో అక్రమ భవంతుల నిర్మాణాలు

-హైడ్రాకు పెద్దోళ్ల దురాక్రమణలు కనిపించడం లేదా...
- పేదోళ్ల గుడిసెలే కనిపిస్తున్నాయా
-మండిపడ్డ బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్ సెప్టెంబర్ మ27 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: జిహెచ్ఎంసి పరిధిలో బండ్లగూడ జాగీర్ మునిసిపాలిటీలోని పీరాన్ చెరువులోనే యథేచ్ఛగా పెద్ద పెద్ద భవంతులు అక్రమంగా నిర్మిస్తున్నారని బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. శుక్రవారం పీరాన్ చెరువులో వెలిసిన అక్రమాలకు సంబంధించిన వీడియోను తన ట్విట్టర్ లో ఆర్ఎస్ పి పోస్టు చేశారు. ఎవరైనా అడుగుతే బడా నాయకులు తమకు బాగా తెలుసునని, ఆర్ ట్యాక్స్ చెల్లించి భవంతులు కట్టుకుంటున్నామని అక్రమార్కులు అంటున్నారని చురకలంటించారు. కోర్టుకు ఎట్ల పోవాలో తమకు తెలుసు అని భూకబ్జాదారులు దబాయిస్తున్నారని, మరి ఇక్కడి అధికారులు ఏంచేస్తున్నారని ఆర్ఎస్ పి ప్రశ్నించారు. పేదోళ్ల ఇండ్లకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే శనివారం-ఆదివారం కూల్చేస్తున్నారని, హైడ్రాకు ఈ పెద్దోళ్ల దురాక్రమణలు కనిపించడం లేదా?.. పేదోళ్ల గుడిసెలే కనిపిస్తున్నాయా? అని ఆర్ఎస్ పి ఆగ్రహం వ్యక్తం చేశారు.

గోవింద్రాలలో గిరిజన యువకుడి హత్య..

ఖమ్మం, సెప్టెంబర్ 27 : (నేటినిజం ప్రతినిధి): దివ్యాంగ గిరిజన యువకుడు హత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని గోవింద్రాల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోవింద్రాల గ్రామానికి చెందిన బావ్ సింగ్ (జగన్) (30) దివ్యాంగుడు. తల్లిదండ్రులు లేకపోవడంతో తన అక్క దగ్గర ఉంటూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు.

అయితే గురువారం రాత్రి మద్యం తాగేందుకు ముగ్గురు యువకులు కలిసి బావ్ సింగ్ ని తీసుకువెళ్లినట్లు సమాచారం. అయితే బావ్ సింగ్ హత్యకు గురైన సంఘటన తెలుసుకున్న పోలీసులు ఖమ్మం నుండి ప్రత్యేక నిఘా బృందాలను పిలిపించి హత్యకు గల కారణాలు, హత్యకు పాల్పడ్డ నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. హత్యకు గల కారణాలు పూర్తిస్థాయిలో తెలియాల్సి ఉంది.

పేదల ఇళ్లు కూలగొడితే చూస్తూ ఊరుకోం : ఎంపీ ఈటల

హైదరాబాద్, సెప్టెంబర్ 27 :పేదల జీవితాలను ఫణంగా పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిజాం సర్కార్ కంటే దారుణంగా ప్రవర్తిస్తున్నదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. మూసీ పరివాకప్రాంతంలో ఆయన పర్యటించి మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చేస్తున్నారు. నోటీసులు పంపుతూ సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. హైడ్రా పేరు చెప్పి పేదలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తురని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేవంత్ రెడ నువ్వు అనుకుంటున్నావ్. మీ తాత జాగీర్ లెక్క పేదల ఇళ్లు కూలగొడితే, పేదల బతుకుల్లో మట్టి కొడితే ఏమి కాదనుకోకు. బాధితులు ఇప్పుడు శాపనార్లాలు పెడుతున్నారు. సంద ర్భం, సమయం వస్తే నీ అధికారం ఏందో, నువ్వేందో అంతు తేల్చేవరకు ప్రజలు వదిలిపెట్టరని హెచ్చరించారు. బాధితులకు అండగా ఉంటామని హామీనిచ్చారు.

ఆసియాలో అత్యంత శక్తిమంతమైన మూడో దేశంగా భారత్.. ఏషియా పవర్ ఇండెక్స్ లో జపాన్ ను మించిన ఇండియా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 : ఏషియా పవర్ ఇండెక్స్ లో జపాన్ ను వెనక్కి నెడుతూ మూడో అత్యంత శక్తిమంతమైన దేశంగా భారత్ నిలిచింది. భౌగోళిక-రాజకీయ స్థాయిలో భారత్ పురోగతికి ఇదొక ప్రధాన నిదర్శనం. ఈ స్థాయికి చేరుకోవడంలో ఇండియా చూపిస్తున్న దూకుడు, అధిక సంఖ్యలో యువ జనాభాను కలిగి ఉండటం, శరవేగంగా దూసుకుపోతున్న ఆర్థిక వ్యవస్థలు చోదక శక్తిగా నిలిచాయి. ఫలితంగా ఆసియాలో ఒక అగ్రగామి శక్తిగా భారతదేశం తన స్థానాన్ని మరింత బలపరచుకొంది.

ఆసియా దేశాల్లో ఎప్పటికప్పుడు భారత్ తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ వస్తోందన్న విషయాన్ని ఈ తాజా 'ఏషియా పవర్ ఇండెక్స్ 2024' స్పష్టం చేస్తోంది. మెల్లగా ఒక్కో మెట్టే ఎక్కుతూ, తన పూర్తి సామర్థ్యం మేరకు రాణించడం ద్వారా ఈ ప్రాంతంలో తన ప్రభావాన్ని చూపించేందుకు యత్నిస్తోంది.

భారత్ పురోగతికి ముఖ్య కారణాలు:

ఆర్థిక వృద్ధి: మహమ్మారి అనంతర కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ గణనీయంగా మెరుగు పడింది. తద్వారా ఇండెక్స్ లో ఆర్థిక ప్రగతి వాటా 4.2 పాయింట్లకు పైగా పెరుగుదలను నమోదు చేసుకుంది. అధిక జనాభా, బలమైన స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి, కొనుగోలు శక్తి సామర్థ్యం (పిపిపి) ప్రకారం చూసినప్పుడు ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానాన్ని బలోపేతం చేసింది.

భవిష్యత్ ప్రగతి: భారతదేశ భావి వనరుల విషయంలోనూ 8.2 పాయింట్ల మేర వృద్ధి కనిపించింది. జనాభా పరంగా భారత్ కున్న గొప్ప నదవకాశం. తన ప్రాంతీయ పోటీదారు దేశాలకు భిన్నంగా, మరీ ముఖ్యంగా చైనా, జపాన్ లతో పోలిస్తే జనాభాలో యువతీ యువకుల సంఖ్య అధికంగా ఉండడంభారత్ కు కలిసొచ్చే అంశం. ఇది రానున్న దశాబ్దాలలో భారత ఆర్థిక వృద్ధికి అండగా ఉంటూ, భిన్న స్థాయిల్లో తన సత్తా చాటడానికి తోడ్పడుతుంది.

దౌత్యపరమైన ప్రభావం: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వం ప్రపంచ దేశాల చూపు ఇటువైపు పడేలా చేసింది. మన దేశం అనుసరిస్తున్న అలీన విధానం అంతర్జాతీయ అంశాల్లో తన సామర్థ్యాన్నిచూపించుకుని అవకాశాన్ని ఇస్తోంది. దౌత్యపరమైన సంభాషణల అంశంలో భారత్ గత సంవత్సరం ఆరో స్థానాన్ని చేజిక్కించుకొంది. తత్ఫలితంగా బహుళ వేదికలలో భారత్ తన భూమికను చురుకైన విధంగా నిర్వర్తిస్తోందని రుజువవుతోంది.

దీనికి అదనంగా, గణనీయంగా పెరుగుతున్న జనాభా, ఆర్థిక శక్తియుక్తులు భారత్ మరింత పురోగమించగలదన్న సంకేతాలు ఇస్తున్నాయి. సంస్కృతి పరమైన అంశాల్లోనూ భారత్ మంచి స్కోర్ నే సాధించింది. ప్రపంచంలో అనేక దేశాలలో స్థిరపడ్డ ప్రవాస భారతీయులు, ప్రపంచ వేదికలపై భిన్న కళా రంగాల్లో చూపిస్తున్న ప్రతిభ ఇందుకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి.

పై అంశాలకు తోడు, బహుళ విభాగాల్లో దౌత్యం, భద్రత సంబంధిత సహకారాలలో భారత్ పోషిస్తున్న పాత్ర కూడా ఎన్నదగ్గదే అని చెప్పాలి. కీలకమైన దౌత్య పరమైన చర్చల్లో పాలుపంచుకోవడమే కాక, క్వాడ్ లో భారత్ నాయకత్వం ప్రాంతీయ భద్రతకు సంబంధించి ముఖ్య పాత్రను పోషించే అవకాశాన్ని ఇచ్చింది. అయితే, లాంఛన సైనిక కూటముల పరిధికి వెలుపల ఇలా జరగడం గమనించ దగ్గది. భారతదేశానికి ఉన్న ఆర్థిక విస్తృతి పరిమిత పరిధి కలిగిందే అయినప్పటికీ దీనిలో, మరీ ముఖ్యంగా రక్షణ రంగ విక్రయాలలో, మంచి పురోగతి చోటు చేసుకొంది. ఫిలిప్పీన్స్ తో బ్రహ్మోస్ క్షిపణి ఒప్పందాన్ని భారత్ కుదుర్చుకోవడం ఇందుకో ఉదాహరణ. ఈ పరిణామాలు పరిశీలించడానికి చిన్న తరహావే కావచ్చు గానీ, తన పొరుగు దేశాల ను తోసిరాజని తనదైన భౌగోళిక-రాజకీయ బలాలను పెంచుకోవడం భారత్ మొదలుపెట్టిందనే సంగతి వెల్లడి అవుతోంది.

ఆసియాలో భారత్ పోషిస్తున్న పాత్ర

ఆసియాలో ఒక ప్రముఖ శక్తిగా భారత్ ఎదిగింది అన్న విషయాన్ని 'ది 2024 ఏషియా పవర్ ఇండెక్స్' తేటతెల్లం చేసింది. ఇండియా లో నెలకొన్న గణనీయమైన వనరుల రాశి మన దేశానికి భవిష్యత్తులో వృద్ధికి కొదువ లేదు అనే సంగతిని ధీకా బజాయించి మరీ చెబుతోంది. రాబోయే కాలంలో భారత్ రాణించే తీరుపై ఎన్నో ఆశలు రేకెత్తుతున్నాయి. ఆర్థిక వృద్ధి బాణం పైపైకి దూసుకుపోతూ ఉండడం, శ్రమ శక్తి వనరు దండిగా పెరుగుతూ ఉండడం రానున్న సంవత్సరాలలో మన దేశం తన ప్రభావాన్ని ఇంకా ఇంకా విస్తరించుకోగలిగే భేషైన స్థితిలో ఉందనే సంకేతాలను ఇస్తున్నాయి. విశేషించి దౌత్యపరంగా ఇండియా ప్రభావం నానాటికీ అధికం అవుతోంది. అంతేకాక, భారత్ కున్న వ్యూహాత్మక స్వతంత్ర ప్రతిపత్తి దీన్ని ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఒక కీలక పాత్రధారిగా నిలబెడుతోంది.

ఆసియా శక్తి సూచి (ఏషియా పవర్ ఇండెక్స్)

లోవీ ఇనిస్టిట్యూట్ 2018వ సంవత్సరంలో 'ది ఏషియా పవర్ ఇండెక్స్'ను వెలువరించడం మొదలు పెట్టింది. ఈ సూచిక ఏషియా-పసిఫిక్ ప్రాంతంలో పురోగతిని ప్రతి ఏటా లెక్కిస్తోంది. ఏషియా-పసిఫిక్ ప్రాంతంలోని 27 దేశాలను మదింపు చేసి, అవి ప్రపంచ దేశాలపై ఏ విధమైన ప్రభావాన్ని చూపుతాయో బేరీజు వేసే సూచి ఇది. ఈ ప్రాంతంలో వాటి శక్తి, ప్రాబల్యాలను పరిగణనలోకి తీసుకుని 2024 సంచికను ఆవిష్కరించింది. మొట్టమొదటి సారిగా తిమోర్-లెస్తే ను ఈ సూచిలో చేర్చారు. ఆగ్నేయాసియాలో తిమోర్-లెస్తే కు పెరుగుతున్న ప్రాముఖ్యాన్ని ఇది తెలియజెబుతోంది. ఈ సూచి ఆయా ప్రభుత్వాల పనితీరుతో పాటు అంతర్జాతీయ వేదికలమీద ఆయా దేశాలు చూపించే ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించారు.

పవర్ నిర్ధారణకు కొలబద్దలు, గీటురాళ్ళు

'ఆసియా శక్తి సూచి' పరంగా శక్తిని కొలవడానికి రెండు గీటురాళ్ళను తీసుకున్నారు; వాటిలో వనరుల ఆధారిత ప్రమాణాలు, ప్రభావం ఆధారిత ప్రమాణాలు అని ఉన్నాయి:

వనరుల ఆధారిత కొలమానాలు:

ఆర్థిక యోగ్యత: ఏ దేశానికి అయినా దాని కీలక ఆర్థిక బలాన్ని కొలిచే సాధనాలలో.. కాసుగోలు శక్తి సామర్థ్యం పరంగా స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి), సాంకేతిక విజ్ఞాన పరమైన ఆధునికత, ప్రపంచ దేశాలతో ఆర్థిక సంధానం అనేవి భాగంగా ఉన్నాయి. సైన్య పరమైన సామర్థ్యం: ఈ గీటురాయి సాంప్రదాయక సైన్య శక్తిని లెక్కగడుతుంది, దీనిలో రక్షణ రంగంపై చేసే వ్యయం, సాయుధ బలగాల తీరు, ఆయుధ శక్తులతో పాటు చాలా దూరం పాటు దూసుకుపోయే శక్తి వంటి ప్రత్యేక సామర్థ్యాల ప్రాతిపదికలుగా ఉంటాయి.

ప్రతికూలతలకు ఎదురొడ్డి నిలిచే శక్తి: ఈ విధమైన శక్తిని కొలవడానికని ఏ దేశానికి అయినా దాని స్థిరత్వానికి ఎదురయ్యే బెదరింపులను నిరోధించగలిగిన ఆంతరంగిక యోగ్యతను ఆధారంగా తీసుకొంటున్నారు. సంస్థాగత దృఢత్వం, భౌగోళిక-రాజకీయ భద్రత, ఇంకా వనరుల పరంగా సురక్షత దీనిలో ప్రాతిపదికలుగా ఉన్నాయి. భావికాలపు వనరులు: ఈ కొలమానం రాబోయే కాలంలో వనరులను ఏ విధంగా పంపిణీ చేయగలుగుతారు అనే విషయాన్ని ముందుగా తెలియజేస్తుంది. దీనిలో 2035వ సంవత్సరం నాటికి ఆయా దేశాల వద్ద ఆర్థిక పరమైన, సైన్య పరమైన, జనాభా పరమైన శక్తి ఏమేరకు ఉండేది అంచనా కడతారు.

ప్రభావ ఆధారిత కొలమానాలు:

ఆర్థిక సంబంధాలు: వ్యాపారం, పెట్టుబడి, ఇంకా ఆర్థిక పరమైన దౌత్యాల పరంగా ఒక దేశం తన పలుకుబడిని ఏ విధంగా వినియోగించి గలుగుతుందనేది దీనిలో ప్రధానంగా పరిగణిస్తారుభద్రత సంబంధిత నెట్‌వర్క్ లు: సైన్య సంబంధ సహకారం, ఆయుధాల బదలాయింపులు.. వీటి ద్వారా కూటములు, భాగస్వామ్యాల శక్తిని కొలుస్తారు.దౌత్య పరమైన ప్రభావం: ఒక దేశానికి దౌత్య పరంగా ఎంతటి పరిధి ఉంది, ఆ దేశం బహుళ చర్చా వేదికలలో ఏ మేరకు పాల్గొంటోంది, విదేశీ విధానం పరంగా చూసినప్పుడు ఒక దేశం బృహత్ కాంక్ష ఏమిటనేవి ఈ ప్రామాణికంగా తీసుకుంటారు.

సాంస్కృతిక పరమైన ప్రభావం: సంస్కృతి పరమైన ఎగుమతులు, ప్రసార మాధ్యమాలు, ఒక దేశ ప్రజలు ఇతర దేశాల ప్రజలతో నెరపే సంబంధాలు.. ఈ మార్గాలలో అంతర్జాతీయ ప్రజాభిప్రాయాన్ని మలచగలిగిన సామర్థ్యాన్ని ఈ కొలమానం ద్వారా కొలుస్తారు.ఈ ఎనిమిది రకాల కొలమానాల మొత్తం సగటుతో ఒక దేశం తాలూకు సమగ్ర శక్తి గణన విషయంలో నిర్ధారణకు వస్తారు. దీనిలో 131 వ్యక్తిగత సూచికలు కూడా కలిసివున్నాయి. ఏషియా పసిఫిక్ ప్రాంత పరిధిలో వివిధ దేశాలు వాటికి ఉన్న వనరులను ఉపయోగించి ఎటువంటి ప్రభావాన్ని ప్రసరింప చేయగలవు అనే విషయాన్ని సూక్ష్మాతి సూక్ష్మ స్థాయిలో అవగాహన చేసుకోనేందుకు ఈ సూచి ఆవిష్కరించే ఫలితాలు అవకాశాన్ని అందిస్తాయి.

రైతు డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కింది

- మండిపడ్డ బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ సెప్టెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: రైతు డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కిందని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రైతు రుణమాఫీపై సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సిఎం పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందని అంటున్నారని, కానీ మంత్రులు ఇంకా రుణమాఫీ చేయాల్సి ఉందని అంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీ అమలు కోసం ఈ నెల 30న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద బిజెపి నేతలు సాధన దీక్ష చేయనున్నారు. ఈ నెల 30న ఉదయం 11 నుంచి 24 గంటల పాటు బిజెపి నేతలు దీక్ష చేయనున్నారు. ఈ సభ స్థలాన్ని శుక్రవారం ఉదయం మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వడ్లకు బోనస్ ఇస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని దుయ్యబట్టారు. రైతు సమస్యలపై బిజెపి పోరాడుతూనే ఉంటుందని ఏలేటి స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బిజెపి జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమెందర్ రెడ్డి, కిసాన్ మోర్చ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఇందిరా పార్కు దగ్గరలోని ధర్నా చౌక్ లో స్థల పరిశీలన చేశారు.

ఆదినారాయణ మృతి బాధాకరం : ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : ఈటీవి హైదరాబాద్ బ్యూరో చీఫ్ ఆదినారాయణ మృతి చాలా బాధాకరమని మాజీమంత్రి, సనత్ నగర్ ఓఎం తలసాని శ

కొత్త ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆకస్మిక తనిఖీ

సిద్దిపేట సెప్టెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: విద్యా సంవత్సరం ముగిసేలాగా కొత్త ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. గదులు, ల్యాబ్లు, వంటశాల, హాస్టల్ నిర్మించినట్లు ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్ కు చెప్పారు. 40 కోట్ల రూపాయలతో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పనులను పరిశీలించారు.

అనంతరం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు త్వరలో వచ్చి మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానని కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమం కు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మురళీకృష్ణ, శ్రీనివాస్, డి ఈ విశ్వప్రసాద్ తదితరులు ఉన్నారు.

శ్రీవారి సన్నిధిలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాల్సిందే - చంద్రబాబు

అమరావతి, సెప్టెంబర్ 27 : తిరుమల శ్రీవారి సన్నిధికి వెళ్లే ప్రతి ఒక్కరూ టిటిడి నిబంధనలు పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు

'' భక్తుల మనోభావాలు, ఆచారాలకు భిన్నంగా ఏ ఒక్కరూ వ్యవహరించొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవారి ఆలయం కోట్లాది మంది హిందువులకు అతిపెద్ద పుణ్యక్షేత్రం. ఈ దివ్యక్షేత్రం ఏపీలో ఉండటం మనందరి అదృష్టం. ఏడుకొండలవాడి పవిత్రతను కాపాడేందుకు, భక్తుల మనోభావాలను పరిరక్షించేందుకు మా ప్రభుత్వం ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. తిరుమల దర్శనానికి వెళ్లే ప్రతి భక్తుడు అత్యంత నియమనిష్టలతో, శ్రద్ధాసక్తులతో స్వామివారిని ఆరాధిస్తారు. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే ఈ క్షేత్ర పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. శ్రీవారి సన్నిధికి వెళ్లే ప్రతి ఒక్కరూ ఆలయ నియమాలు, ఆగమశాస్త్ర ఆచారాలను, టిటిడి నిబంధనలను తప్పక పాటించాలని కోరుతున్నా. భక్తుల మనోభావాలకు, ఆలయ ఆచారాలకు భిన్నంగా ఎవరూ వ్యవహరించొద్దని విజ్ఞప్తి చేస్తున్నా" అని చంద్రబాబు ట్వీట్ చేశారు

హైదరాబాద్ మరో అగ్నిగోళం అవుతుంది.. కాంగ్రెస్ సర్కార్‌కు పటోళ్ల కార్తీక్ రెడ్డి హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబర్ 27 :మూసీ పరివాహక ప్రాంతంలో ప్రజల ఆవేదం తీసుకున్న తర్వాతనే ప్రక్షాళన చేపట్టాలి.. లేదు మేం బలవంతం చేస్తాం అంటే మాత్రం హైదరాబాద్ మరో అగ్నిగోళం అవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి హెచ్చరించారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న వారి వెంట కేసీఆర్ ఉన్నాడు.. మీరు ఎవరూ భయపడొద్దు.. బీఆర్ఎస్ పార్టీ వాళ్ల తరపున పోరాడుతుందని కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కార్తీక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

మూసీ నదిపై ఆదిత్య నిర్మాణ సంస్థ నిర్మాణాలు చేస్తుంటే వాటిని ఆపకుండా, పేదలు.. సామాన్యులు ఉండే హైదర్‌షాకోట్ విలేజ్‌లో అధికారులు ఇండ్లకు మార్కింగ్ చేయడం జరిగింది.

ఆదిత్య నిర్మాణ సంస్థ ప్రభుత్వ పెద్దల చేతులు తడిపింది అందుకే వారిని వదిలేశారు చేతులు తడపని పేదల ఇండ్లపై హైడ్రాను వాడుతున్నారు. 2022లో ఆదిత్య నిర్మాణ సంస్థకి మా బీఆర్ఎస్ ప్రభుత్వమే పర్మిషన్ ఇచ్చింది, కానీ తర్వాత ఆ పర్మిషన్‌ని నిలుపుదల చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి ఆదిత్య నిర్మాణ సంస్థకు అక్కడ బిల్డింగ్ కట్టుకునేందుకు పర్మిషన్ ఇచ్చారని కార్తీక్ రెడ్డి తెలిపారు.

2400 కిలోమీటర్ల పొడవున్న నమామి గంగే ప్రాజెక్టుకి అయిన ఖర్చు రూ.40 వేల కోట్లు. అయితే గండిపేట నుంచి నాగోల్ వరకు 55 కిలోమీటర్లు విస్తీర్ణం కలిగి ఉన్న మూసీ నది సుందరీకరణకు అవుతున్న ఖర్చు రూ. లక్షా 50 వేల కోట్లు. ఇక మూసీ నది డీపీఆర్ కోసం రూ.1500 కోట్లు ఖర్చు చేయబోతుంది ఈ ప్రభుత్వం.. ప్రపంచంలో ఎక్కడైనా చూస్తామా డీపీఆర్ కోసం ఇంత ఖర్చు పెట్టడం.. అని పటోళ్ల కార్తీక్ రెడ్డి ప్రశ్నించారు.

మూసీ సుందరీకరణ అనేది లక్షా అరవై వేల కోట్ల రూపాయల కుంభకోణం.

ఆనాడు బీఆర్ఎస్ హయాంలో మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.16,000 కోట్లు. కానీ నేడు అదే మూసీ సుందరీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1,50,000 కోట్ల వ్యయం పెంచింది.. ఇది పెద్ద కుంభకోణం అని పటోళ్ల కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు.

సనాతన బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి- ధర్మపురి అరవింద్

నిజామాబాద్, సెప్టెంబర్ 27: సనాతన ధర్మ స్థాపన కోసం సనాతన బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని ఎంపీ ధర్మపురి అరవింద్ డిమాండ్ చేశారు. కలియుగ దైవమైన తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదంలో జరిగిన కల్తీపై పూర్తి విచారణ చేపట్టి వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందూ సమాజాన్ని ఐక్యతను దెబ్బ తీసే కుట్ర జరుగుతొందన్నారు. లడ్డు వివాదంపై కేంద్రం కూడా సీరి యస్ గా నే ఉందన్నారు. తిరుమలలోలడ్డు మాత్రమే కాదు భక్తులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం బీజేపీనే ..

తెలంగాణలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం బీజేపీయే ననికష్టపడి పనిచేస్తే వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. బీఆర్ఎస్ ను ప్రస్తుతం ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. హైడ్రా కూల్చివేతలు సెలెక్టివ్ కాకుండా సెక్యులర్ గా ఉండాలన్నారు. కులం, మతం, ప్రాంతం వంటి బేధాలు చూడొద్దన్నారు. హైడ్రాను జిల్లాలకు విస్తరించాలన్నారు. పరికోతలు మొదలుకాక ముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

డీఎస్ ప్రజలమనిషి.. ధర్మపురి శ్రీనివాస్ కు ఘన నివాళి..

ప్రతిరోజు ప్రజల కోసం పరితపించి తన రాజకీయ జీవి తాన్ని అంకితం చేసి.. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజల మనిషి ధర్మపురి శ్రీనివాస్ అని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ధర్మపురి శ్రీనివాస్ జయంతి సందర్భంగా శుక్రవారం నగ రంలోని కంటేశ్వర్ బైపాస్ రోడ్డు వద్ద గల డి.శ్రీనివాస్ ఘాట్ వద్ద ఎంపీ ధర్మపురి అరవింద్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ ధర్మపురి శ్రీనివాస్ తన కు రాజకీయ గురువు అని తెలిపారు. ధర్మపురి శ్రీనివాస్ రాజకీయాల గతీతంగా ప్రజా సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేశారని తెలిపారు. ప్రజాసేవే ధ్యేయంగా ధర్మపురి శ్రీనివాస్ చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, మాజీ జిల్లా అధ్యక్షులు బసవ లక్ష్మీ నరసయ్య, బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రవంతి రెడ్డి, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చే వరకు రేవంత్ రెడ్డిని నిద్రపోనీయను : హరీశ్ రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : సంగనూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేపట్టారు. రూ.2 లక్షల రుణమాఫీతోపాటు రైతులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. ధర్నాలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ జరిగే వరకు నేను నిద్ర పోను, రేవంత్ రెడ్డిని నిద్రపోనీయను అన్నారు.

రైతుబంధు కేసీఆర్ హయంలో నాట్లకు రైతుబంధు అందిస్తే, ఈ ప్రభుత్వం పంట కోతకు వచ్చినా రైతుబంధు ఇవ్వలేదని మాజీ మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు దొంగరాత్రి కరెంట్ ఇస్తుందని, కానీ కేసీఆర్ కడుపు నిండా 24 గంటల కరెంట్ ఇచ్చిందని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు వచ్చిన 24 గంటల కరెంటు.. ఇప్పుడెందుకు వస్తలేదని ఆయన ప్రశ్నించారు. కరోనా సమయంలోనూ రైతు బంధుకు సమయం ఇచ్చినమన్నారు.

రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని, ఈ వానాకాలం ఆయన చెప్పిన రూ.7,500 లేవని, గతంలో ఇచ్చిన రూ.5 వేలు లేవని మండి పడ్డారు. రైతు బంధు ఇవ్వకుండా రైతులను అప్పులపాలు చేస్తున్నారని విమర్శించారు. కుంటిసాకులు, అబద్ధాలతో కాలం గడుపుతున్నారని అన్నారు. కేసీఆర్ 11 సార్లు సమయానికి రైతు బంధు ఇచ్చిందని, వడ్లు కొంటే మూడు రోజుల్లో పైసలు వేసిందని చెప్పారు.

కేసీఆర్ రైతు విలువ, రైతు భూమి విలువ పెంచిందని, కానీ కాంగ్రెస్ వచ్చినంక రైతు విలువ తగ్గిందని, భూమి విలువ తగ్గిందని హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం కూలిపోయిందంటున్న రేవంత్ రెడ్డి వచ్చి రంగనాయకసాగర్, మాల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ చూడాలని సూచించారు. కాళేశ్వరంలో వంద బాగాలు ఉంటాయని, అందులోని ఒక్క భాగంలో రెండు పిల్లర్లు కుంగితే మొత్తం పోయిందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

కేసీఆర్ వచ్చి కాళేశ్వరం కట్టినంక రైతులు రెండు పంటలు పండిస్తున్నరని చెప్పారు. రెండు లక్షల మాఫీ, వడ్లకు బోనస్ అన్నారని, వచ్చిందా అని మాజీ మంత్రి ప్రశ్నించారు.

కుష్టు ఉందని విడాకులు సరికాదు : సాయి చౌదరి

హైదరాబాద్ సెప్టెంబర్ 27 (ఎక్స్ ప్రెస్స్ న్యూస్):: విడాకులు తీసుకోవాలనుకునే భార్య/ భర్త తమ జీవిత భాగస్వామికి కుష్టు వ్యాధి ఉందనే కారణం చూపడం కుదరదు అని మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సాయి చౌదరి తెలిపారు. మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేడు శ్రీరామ్ నగర్ ప్రభుత్వ ప్రైమరీ హాస్పటల్ యందు కుష్టు వ్యాధిగ్రస్తులకు సల్ఫ్ కేర్ కిట్స్ బహుకరణ మరియు మైక్రో సెల్యులర్ రబ్బరుతో తయారు చేసిన పాదరక్షలు బహుకరణ లాంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సాయి చౌదరి మాట్లాడుతూ ఈ మేరకు చట్టాన్ని సవరించేందుకు ఉద్దేశించిన బిల్లును లోక్ సభ ఆమోదించిందని, జీవిత భాగస్వామికి కుష్టు వ్యాధి ఉందనే కారణం చూపి ఇకపై విడాకులు పొందేందుకు వీలుండదని, కుష్టు నయం కాదని ఇదివరకు అందరూ భావించేవారు, కానీ ఈ వ్యాధికి చికిత్స ఉంది అని వ్యక్తిగత చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించారని సాయి చౌదరి తెలిపారు. స్టేట్ లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ జాన్ బాబు మాట్లాడుతూ ప్రథమ దశలో కుష్టు వ్యాధిగ్రస్తులను కనుగొని బహుళ ఔషధ చికిత్స ద్వారా స్వస్థత చేకూర్చుటయే కాక అంగవైకల్యాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చు అని కుష్టు వ్యాధి ఏ దశలోనైనా బహుళ ఔషధ చికిత్స ద్వారా పూర్తిగా నయం అవుతుంది అని అన్నారు. కుష్టు వ్యాధి పీడితులను ఎటువంటి కళంకిత భావము, వివక్షతో చూడకుండా వారు సమాజంలో ఒక భాగం అని వారికి పూర్తి సహాయ సహకారములు అందిస్తామని, కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో అందరమూ పాలుపంచుకుంటామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమమునకు హైదరాబాదు జిల్లా అదనపు వైద్యాధికారి మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మోసం చేయాలని జగన్ చూస్తున్నారు- బైరెడ్డి

అమరావతి, సెప్టెంబర్ 27 : మరోమారు మోసం చేయాలని జగన్ చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా ఓల్డ్ కల్లూరు శ్రీ వీర భద్రస్వామి ఆలయంలో బైరెడ్డి రాజ శేఖర్ రెడ్డి, బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భ ంగా బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లా డుతూ ఎంతో పవిత్రమైన తిరుమల లడ్డూను కల్తీ చేసి, ఆలయ పవిత్రతను దెబ్బతీసి, వెంకన్న భక్తుల ఆగ్రహానికి గురైన జగన్, ఆయన గ్యాంగ్ మళ్ళీ సమస్యను పక్కదోవ పట్టించాలని చూస్తున్నారన్నారు. రాయలసీమలోని గ్రామాల్లో ఎవరైనా తప్పుచేస్తే చేసిన తప్పుకు గ్రామ ప్రజల సమక్షంలో సుం కులమ్మ కొరడా (సెలకాల) తో గ్రామ రచ్చబండ వద్ద కొట్టుకునే సంప్రదాయ ంమని, వైఎస్ జగన్ కూడా సుంకులమ్మ కోరడాతో బట్టలు ఇప్పి కొట్టుకున్నా తిరుమలలో చేసిన పాపం పోదని బైరెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో క లూ ట్లరు లక్ష్మిరెడ్డి, వేముల శ్రీధర్, బీజేపీ నాయకులు నాగరాజు, పచ్చాతాప పూజల్లో పాల్గొన్నారు.

అక్రమ కార్యకలాపాలపై ఉక్కు పాదంతో అణచి వేయండి .. సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్, సెప్టెంబర్ 27 : డయల్ 100 కాల్ రిసీవ్ చేసుకోగానే వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఆదేశించారు.

గురువారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ లో గల పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వ హించి పలు సూచనలు ఇచ్చారు. వాటికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టిపెట్టి క్షేత్ర స్థాయిలో ఫలితాన్నిచ్చే విధంగా సందర్శనలు ఉండాలన్నారు. స్థానికంగా ఉండే శాంతి భద్రతల సమస్యలు, రౌడీ షీటర్లు మరియు హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు.ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో అధికారుల ద్వారా ప్రజల్లో అవగా హన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు.అక్రమ ఇసుక రవాణా, పి.డి.ఎస్. బియ్యం రవాణా, మద్యం బెల్టు షాపుల నిర్వహణ వంటి అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి, పట్టుబడిన వారిపై తగిన కేసులు నమోదు చేయాలన్నారు.

ప్రకాశ్ రాజ్ నాకు మంచి మిత్రుడు : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

అమరావతి, సెప్టెంబర్ 27 : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, టాలీవుడ్ నటుడు ప్రకాశ్ రాజ్‌ల మధ్య డైలాగ్ వార్ సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదం వివాదం నేపథ్యంలో ఈ ఇద్దరు యాక్టర్లు ఎవరి స్టైల్‌లో వాళ్లు పంచ్ వేస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నారు. తన పోస్ట్‌ను పవన్ కల్యాణ్ తప్పుగా అర్థం చేసుకున్నాడని ప్రకాశ్ రాజ్ వీడియో పెట్టిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా పవన్ కల్యాణ్ స్పందించాడు. ప్రకాశ్ రాజ్ నాకు శత్రువు కాదు మిత్రుడే అంటూ చెప్పుకొచ్చాడు.

వ్యక్తిగతంగా ప్రకాశ్‌రాజ్ అంటే నాకు చాలా ఇష్టమని.. నాకు మంచి స్నేహితుడు కూడా. రాజకీయంగా మాకు భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు కానీ ఒకరిపట్ల ఒకరికి గౌరవం ఉంది. నటుడిగా ఆయన్ని గౌరవిస్తా. ఆయనతో కలిసి వర్క్ చేయడం నాకెంతో ఇష్టం. అయితే తిరుమల లడ్డూ విషయంలో ప్రకాశ్ రాజ్ స్పందించాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా (దిల్లీలో మీ స్నేహితులంటూ) ఆయన ఆవిధంగా కామెంట్ చేయాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి అందుకే దోషులకు శిక్ష పడాలనే ఉద్దేశంతో పోస్ట్ పెట్టా. ఆయన పోస్ట్ నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. ఆయన ఉద్దేశం నాకు అర్థమైంది అంటూ పవన్ చెప్పుకొచ్చాడు.

రెండు కాలేజీ బస్సులు ఢీ. డ్రైవర్ మృతి, విద్యార్థులకు గాయాలు

మెదక్,సెప్టెంబర్ 27 : మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. బి.వి.ఆర్.ఐ.టి కళాశాలకు చెందిన రెండు బస్సులు నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మరణించగా, బస్సులో ఉన్న విద్యార్థులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరారు. ప్రమాద తీవ్రత ఎంతైనా, గాయపడిన విద్యార్థుల ందరూ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. కానీ ఈ ఘటన వలన విద్యార్థుల్లో, వారి కుటుంబాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

ప్రమాదం వివరాలు..

శుక్రవారం ఉదయం నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై రెండు బస్సులు ఎదురెదురుగా వెళ్తూ ఢీకొన్నాయి. ఈ రెండు బస్సులు బి.వి.ఆర్.ఐ.టి. కళాశాలకు చెందినవే కావడం, వాటిలో విద్యార్థులు ప్రయాణిస్తుండటం పెద్ద విషాదాన్ని కలిగించింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, ఇతర ప్రయాణికులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వెంటనే అంబులెన్స్‌లు అక్కడికి చేరుకుని గాయపడిన విద్యార్థులను సమీప ఆసుపత్రులకు తరలించారు.

డ్రైవర్ మృతి..

ఈ ప్రమాదంలో ఒక బస్సు డ్రైవర్ కు తీవ్ర గాయాలు కారణంగా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. డ్రైవర్ మృతిచెందిన వార్త కళాశాల సిబ్బంది, విద్యార్థుల కుటుంబాలను తీవ్రంగా కలచివేసింది. డ్రైవర్ అనుభవజ్ఞులైనప్పటికీ, ప్రమాద పరిస్థితుల వలన అతని ప్రాణాలు రక్షించడానికి అవకాశం లేకపోయింది.

విద్యార్థులకు గాయాలు..

బస్సుల్లో ఉన్న విద్యార్థుల్లో చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను సంగారెడ్డి, హైదరాబాద్ లోని ఆసుపత్రులకు అత్యవసర చికిత్స కోసం తరలించారు. కొంతమంది విద్యార్థుల పరిస్థితి తీవ్రంగా ఉండడంతో వైద్యులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే, గాయపడిన వారిలో కొందరికి చిన్న చిన్న గాయాలు మాత్రమే తగలడంతో వారిని చికిత్స అనంతరం ఇంటికి పంపించారు.

పోలీసుల విచారణ..

ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సులు ఎంత వేగంగా ప్రయాణించాయి, డ్రైవర్‌ల మధ్య కమ్యూనికేషన్ లోపం ఏమైనా ఉందా అన్న విషయాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. బస్సులు ఒకదాని మీద ఒకటి వచ్చి ఢీకొట్టిన విధానంపై ఆధారాలు సేకరిస్తున్నారు. ప్రాథమికంగా, ప్రమాదానికి కారణం అధిక వేగం అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నప్పటికీ, పూర్తి సమాచారం కోసం విచారణ కొనసాగుతోంది.

స్థానికుల్లో భయాందోళనలు..

ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర భయాందోళనలు కలిగించింది. చాలా మంది విద్యార్థులు ఈ బస్సుల్లో ప్రయాణిస్తున్నారన్న వార్త, వారి కుటుంబాలలో భయాన్ని రేకెత్తించింది. ప్రమాదం తరువాత, విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కళాశాల ఆవరణకు చేరుకుని వారి పిల్లల గురించి సమాచారం కోసం ఎదురుచూస్తున్నారు. కొన్ని గంటల తర్వాత మాత్రమే గాయపడిన విద్యార్థుల వివరాలు బయటకు వచ్చాయి, కానీ అప్పటివరకు భయంతో, ఆందోళనతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కాలక్షేపం చేశారు.

విద్యార్థుల రక్షణపై చర్చ..

ఈ ఘటన విద్యార్థుల రక్షణ గురించి కొత్తగా చర్చలను ప్రారంభించింది. కళాశాల బస్సులు తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, డ్రైవర్‌లకు ఉండాల్సిన పర్యవేక్షణ, బస్సుల మరమ్మత్తులు, నిర్వహణ పద్ధతులు అన్నీ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయి. విద్యార్థుల ప్రయాణం సురక్షితంగా ఉండాలంటే, డ్రైవర్‌లు వేగం నియంత్రణ పాటించడం, ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా పాటించడం తప్పనిసరి. ఈ ప్రమాదం వల్ల విద్యార్థుల రక్షణపై మరింతగా శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని స్థానికులు, అధికార వర్గాలు గుర్తించాయి.

ప్రభుత్వం నుండి చర్యలు..

ఈ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న తెలంగాణ ప్రభుత్వ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.

ప్రభుత్వం కూడా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటోంది. ఈ ప్రమాదానికి సంబంధించిన కారణాలు పూర్తిగా వెల్లడైన తర్వాత, ప్రభుత్వ పెద్దలు మరింత చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కళాశాల విద్యార్థుల రక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

అవసరమైన జాగ్రత్తలు..

ఈ ప్రమాదం అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్న సూచనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, బస్సుల్లో ప్రయాణించే సమయంలో అన్నిరకాల రక్షణ చర్యలు తీసుకోవాలి. బస్సు డ్రైవర్‌లకు సరైన శిక్షణ అందించడం, వారికి అందించాల్సిన పర్యవేక్షణ, రోడ్డుపై నిర్దిష్ట వేగాన్ని పాటించడం వంటి అంశాలు ముందుగా పరిశీలనలోకి తీసుకోవాలి.

అభిప్రాయాలు..

ఈ ప్రమాదం విద్యార్థుల భద్రత గురించి కొత్త ప్రశ్నలను తెరమీదకు తెచ్చింది. కళాశాల బస్సులు, ప్రధానంగా విద్యార్థుల ప్రయాణానికి ఉపయోగపడే బస్సులు, రహదారి నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల ప్రయాణం సురక్షితంగా ఉండాలని స్థానికులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంఘటనపై స్పందనలు..

విద్యార్థుల రక్షణ ముఖ్యమని, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా అభిప్రాయపడ్డారు. ఈ ప్రమాదం వల్ల మృతిచెందిన డ్రైవర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. గాయపడిన విద్యార్థులు త్వరగా కోలుకోవాలని అన్నివర్గాల నుండి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

మూసీ నిర్వాసితుల తరలింపునకు ప్రత్యేక సిబ్బంది.. జీహెచ్ఎంసీ ఉత్తర్వులు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 :మూసీ నది ప్రక్షాళన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. స్థానికుల ఆవేదనను పట్టించుకోని ప్రభుత్వం.. వారిని అక్కడ్నుంచి బలవంతంగా పంపించేందుకు చర్యలు తీసుకుంటోంది.

ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. మూసీ నిర్వాసితులను మరో ప్రాంతానికి తరలించేందుకు 14 మంది హౌసింగ్ సిబ్బందిని నియమిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు.

పిల్లిగుడిసెలు, జంగమ్మెట్, ప్రతాపసింగారం, సాయిచరణ్ కాలనీ, కమలానగర్, కొల్లూరు-1, గాంధీనగర్, జై భవానీ నగర్, తిమ్మాయిగూడ, నార్సింగి, బండ్లగూడ, డి పోచంపల్లి-2, బాచుపల్లిలో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లకు నిర్వాసితులను తరలించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
సీల్‌వెల్ కార్పోరేషన్ - శృతిలయ ఆర్ట్ అకాడమి
అదర్శ ఫౌండేషన్ - ఆర్.ఆర్. ఫౌండేషన్
సీల్వెల్ - శృతిలయ అక్కినేని మీడియా ఎక్స్‌లెన్స్ అవార్డ్ - 2024
SEALWEL CORPORATION PRIVATE LIMITED
LIC
పద్మవిభూషణ్ డా॥ అక్కినేని శతజయంతి వేడుకలు
ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా అవార్డ్స్ 2024 అక్కినేని స్మూర్తి పురస్కారాలు
ఆకాశ వీధిలో అందాల జాబిలి
28-09-2024 శనివారం మ॥ 11.45 గం॥నుండి (సభా కార్యక్రమం రా॥ 7.00 గం.లకు) శ్రీ త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్
పద్మవిభూషణ్ డా॥ అక్కినేని శతజయంతి వేడుకలు
సీల్వెల్ - శృతిలయ అక్కినేని మీడియా ఎక్స్‌లెన్స్ అవార్డ్-2024
సీల్వెల్ - శృతిలయ అక్కినేని సామాజిక సేవా పురస్కారాలు- 2024
సీల్వెల్ - శృతిలయ అక్కినేని సాంస్కృతిక సేవా పురస్కారాలు-2024
సీల్వెల్ - శృత

ఆత్మ రక్షణ నైపుణ్యాలే అమ్మాయికి జీవితకాల మాన ప్రాణ రక్షణలు

– లయన్: కెప్టెన్: డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : మృగాళ్లు తిరుగుతున్న నేటి

సమాజంలో అమ్మాయిలకు జీవితకాల రక్షణ గొడుగుగా ఆత్మ రక్షణ నైపుణ్యాలు ఉపకరిస్తాయని లయన్: కెప్టెన్: డా: బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు.

ఈ రోజు సత్యగ్రి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆల్ఫోర్స్ మహిళా కళాశాల లియో క్లబ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన "సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ ప్రదర్శన" కార్యక్రమాన్ని ప్రారంభించి ముఖ్య అతిథి సందేశమిస్తూ దేశవ్యాప్తంగా చిన్నారుల నుంచి వయోభార మహిళల వరకు స్త్రీ సమాజం ఎదుర్కొంటున్న అత్యాచార కేసులకు సమాధానంగా ప్రతి యువతి తప్పనిసరిగా సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నేర్చుకొని తనను తానే ధైర్య సాహసాలతో రక్షించుకోవాలని కోరారు. మృగాళ్లు భౌతిక దాడి చేసినపుడు తనను తాను ఎలా రక్షించుకొని ప్రమాదం నుంచి బయట పడాలో లియో క్లబ్బు సభ్యులు ప్రదర్శించి చూపగా విద్యార్థినులు తిరిగి ప్రదర్శించి చూపడం సంతోషదాయకమని పాఠశాల హెచ్ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు గాజుల రవిందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ గోలి శ్రీనివాస్, పిడీ తదితరులు కూడా పాల్గొన్నారు. లియో కనక్ ముందడా నేతృత్వంలో 15 మంది ఆల్ఫోర్స్ మహిళా కళాశాల విద్యార్థినిలు 12 రకాల ఆత్మరక్షణ టెక్నిక్స్ ప్రదర్శించి పాఠశాల విద్యార్థినులకు నేర్పారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం లియో జట్టును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో 120 మంది పాఠశాల 6 నుంచి 10వ తరగతి విద్యార్థినులు పాల్గొని ఆత్మ రక్షణ పద్ధతులను ప్రయోగ పూర్వకంగా నేర్చుకున్నారు. ఈ సందర్భంగా లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ పక్షాన నిర్వహించిన "పర్యావరణ కాలుష్యం – పరిష్కార మార్గాలు" అనే అంశంలో చిత్ర లేఖన పోటీల్లో విజేతలకు కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

హైడ్రా పేరుతో సర్కార్ హై డ్రామా

– మూసి బెల్ట్ లో హైడ్రా ఇండ్లు కూల్చివేసిన భాదితులను పరామర్శించిన బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్,

హైదరాబాద్ సెప్టెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);హైడ్రా పేరుతో సర్కార్ హై డ్రామాలు ఆడుతుందని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. హైడ్రాబాద్, మూసి బెల్ట్ లో హైడ్రా ఇండ్లు కూల్చివేసిన భాదితులను బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్, పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పేదల ఇండ్లను, గుడిసెలను కూల్చుతున్న సర్కార్ కు... పెద్దల ఇండ్లు కనిపించడం లేదా...?అని ప్రశ్నిన్చారు.మూసి ఒడ్డున ఈఒ అని తెలియక చాలా మంది నిరుపేదలు ఇక్కడ కొనుకున్నారని,ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అధికారులు కూల్చడానికి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి బీదల సదక బాధకాలు తెలుసుకోకుండా అమెరికా పర్యటనలు చేస్తూ టైం పాస్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ లో బడాబాబులకు నోటీసులు ఇచ్చారని వారు కోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చుకుంటున్నారని, మరి ఈ పేదవారికి నోటీసులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పేదల ఇండ్లను కూలుస్తున్న ముఖ్యమంత్రికి... ఆయన అన్న ఇంటిని ఎందుకు కూల్చాలేదని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ కాళేశ్వరం పేరుమీద దోచుకుంటే, మిరేమో మూసి ప్రక్షాళన పేరు మీద దోచుకుంటున్నారని ఆరోపించారు. ఉద్యోగులకు జీతాలకు , ఆరు హామీలు అమలు పర్చడానికి డబ్బులు లేవు కానీ, మూసి ప్రక్షాళనకు డబ్బులు ఎక్కడివి అని ప్రశ్నించారు.పాత బస్తి నాయకులు కబ్జా చేసి కట్టిన వాటిని ఎందుకు కూల్చడం లేదన్నారు.గతంలో బిఆర్ఎస్ పార్టీ దోపిడీ చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అదే చేస్తున్నాదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇట్టి కార్యక్రమాన్ని ఆపకపోతే బిజెపి ఎమ్మెల్యేలు ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రవాసి ప్రజావాణి ప్రత్యేక కౌంటర్ ప్రారంభించిన పొన్నం

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గల్ఫ్ బాధితుల కోసం ప్రవాసి ప్రజావాణి అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ప్రజావాణి కార్యక్రమం మాదిరిగానే ఈ కార్యక్రమం ప్రతి బుధ, శుక్రవారాలు ప్రభుత్వం నిర్వహించనుంది. గల్ఫ్ బాధితులు తమ సమస్యలు చెప్పుకోవడానికి ప్రవాసి ప్రజావాణి వేదికగా ఉంటుంది.

మొదటి అభ్యర్థన స్వీకరించిన మంత్రి పొన్నం

మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో ప్రవాసి ప్రజావాణి మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడుతున్నామేక్ హుస్సేన్ కుటుంబం నుండి మొదటి అభ్యర్థనను మంత్రి పొన్నం ప్రభాకర్ స్వీకరించారు. సమస్యల వినతి కోసం గల్ఫ్ కార్మికులు భారీగా పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి తెలంగాణ వ్యాప్తంగా గల్ఫ్ కార్మికులు సమస్యలపై పెద్ద ఎత్తున తరలి వచ్చి ఫిర్యాదు ఇచ్చారు.

గల్ఫ్ బాధితులను ఆదుకోవడానికే : మంత్రి

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో చెప్పినట్టు నాలుగు అంశాల పై నిర్ణయం తీసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రం నుండి గల్ఫ్ దేశాలకు పెద్ద ఎత్తున ఉపాధి నిమిత్తం వెళ్ళారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. గల్ఫ్ ప్రమాదంలో చనిపోయిన వారికి 5 లక్షల ఎక్స్ గ్రెషీయ ఇవ్వడానికి ఇప్పటికే జీవో జారీ చేసుకున్నామని చెప్పారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాల పిల్లల చదువులకు ఇబ్బందులు లేకుండా గురుకులాల్లో సీట్లు కల్పిస్తున్నామని తెలిపారు. గల్ఫ్ కార్మికుల కోసం ఉత్తర తెలంగాణ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

తెలంగాణ లోని వరదబాధితులకు హైదరాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ పుస్తకాల పంపిణి

హైదరాబాద్ సెప్టెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి ఆదేశాల మేరకు యూత్ రెడ్ క్రాస్ (జఖీఅ) కన్వీనర్ మణిదీప్ ఆధ్వర్యంలో ఫతేనగర్ కార్పొరేటర్ తండాల సతీష్ గౌడ్ గారి చొరవతో బాలానగర్ లోని ఔఐఐ హై స్కూల్ యాజమాన్యం ఇటీవల తెలంగాణ లోని ఖమ్మం, నూర్యాపేట, మహబూబాబాద్ మరియు ఆంధ్రాలోని విజయవాడ లో సంభవించిన వరదలలో నష్టపోయిన వరద బాధిత పిల్లల కోసం 5000 పుస్తకాలు మరియు స్టేషనరీని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హైదరాబాద్ జిల్లా శాఖకు అందజేయడం జరిగింది. దీనిలో భాగంగా గత కొన్ని రోజుల నుండి హైదరాబాద్ లోని మొత్తం స్కూల్ మరియు కళాశాలల నుండి వరద బాధితుల పిల్లల కోసం రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ పుస్తకాలు మరియు స్టేషనరీ ని సేకరిస్తున్నారు. మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి సేవా భావం తో ఈ కార్యక్రమంలో భాగంమైన ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మరియు ఔఐఐ పాఠశాల యాజమాన్యం, పాఠశాల హెడ్ మాస్టర్ సునీధ, మరియు సెక్రటరీ బాబుకు రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో రెడ్ క్రాస్ తో సేవా కార్యక్రమాలను చేయాలని హైదరాబాద్ జిల్లా శాఖ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మీకు మరొకసారి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తుంది.

వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం?

విశాఖపట్నం సెప్టెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను సెయిల్ లో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోన్నన్నట్లుతెలుస్తుంది. . విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అంటూ నాడు గొప్పగా చెప్పుకున్న కంపెనీ నేడు ఆర్థిక నష్టాల్లో కూసరిల్లుతోంది. అందుకనే సెయిల్ లో కలపాలని చూస్తున్నారు. విశాఖ కు 2000 ఎకరాల భూమి కూడా ఉంది. దాన్ని కూడా విక్రయించే యోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్కడి కార్మికులు కొన్ని నెలలుగా ధర్నాలు చేస్తున్నారు.

ఐఐఐటీ హైదరాబాద్‌లో డాట్ ఔట్‌రిచ్ సెషన్

–5జీ, 6జీ సేవల విస్తరణలో భాగస్వాములు కావాలని

–విద్యార్థులకు నిపుణుల సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : హైదరాబాద్ గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవుట్‌రీచ్ సెషన్ నిర్వహించారు. 2030 నాటికి 193 దేశాల్లో 5జీ, 6జీ సేవలు విస్తృతం కానున్నందున.. ఈ పురోభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా నేషనల్ కమ్యూనికేషన్ అకాడమీ జనరల్ డైరెక్టర్ దేబ్‌కుమార్ చక్రవర్తి, ప్రొఫెసర్లు ఆర్ఆర్ మిట్టూర్, ప్రతీక్‌శర్మ, భరద్వాజ్ అమృతార్, అతులొసిన్హా, రాజేశ్‌గుప్తా, అవినాష్ అగర్వాల్ మాట్లాడుతూ.. టెక్నాలజీలో భారత్ పురోగమిస్తున్నందున.. ఇందులో ఐఐఐటీ విద్యార్థులు భాగస్వాములై నూతన ఆవిష్కరణలకు నాంది పలుకాలని ఆకాంక్షించారు. డాట్ ప్రతినిధి మహేంద్రశర్మ ఈ కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు.

భారత్‌కు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వంకై యూకే మద్దతు

న్యూ డిల్లీ సెప్టెంబర్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్)(ప్రపంచ శాంతి స్థాపనే లక్ష్యంగా ఏర్పాటైన ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి లో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ దిశగా ప్రధాని మోదీ ప్రపంచ దేశాల మద్దతు కూడగడుతున్నారు. భారత్ ప్రయత్నాలకు అంతర్జాతీయంగా మద్దతు లభిస్తోంది.ఇప్పటికే పలు దేశాలు భారత్ కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం మద్దతు ప్రకటించాయి. తాజాగా ఈ జాబితాలోకి యూకే కూడా వచ్చి చేరింది. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 79వ సెషన్‌లో బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ మాట్లాడుతూ.. యూఎన్ఎస్‌సీలో మరిన్ని దేశాలు ప్రాతినిధ్యం వహించాలని పేర్కొన్నారు. 'భద్రతా మండలిలో తగినన్ని సభ్యదేశాలు లేనంతవరకూ ప్రతిపక్ష ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకు సాగడం కష్టం. కాబట్టి భద్రతామండలిని మరింత పటిష్టం చేయాలి. ఇందులో భాగంగానే శాశ్వత సభ్యత్వ దేశాల సంఖ్యను పెంచాలి. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాలుగా భారత్, బ్రెజిల్, జపాన్, జర్మనీ ఉండాలని కోరుకుంటున్నాం. ఆఫ్రికా నుంచి రెండు దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి' అని అన్నారు.అంతకుముందు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రన్ స్పందించిన విషయం తెలిసిందే. జనరల్ అసెంబ్లీలో మెక్రాన్ ప్రసంగిస్తూ.. యూఎన్ఎస్‌సీ విధానాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని మెక్రాన్ అభిప్రాయపడ్డారు. భద్రతా మండలిలో భారత్‌కు మద్దతు ప్రకటించారు. యూఎన్ఎస్‌సీ సమర్థతను పునరుద్ధరించడానికి ఈ మార్పులు తగినవి అని పేర్కొన్నారు. ఇక గత వారం ఐరాస భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి అమెరికా కూడా మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక అమెరికన్ టైకూన్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సైతం గతంలోనే భారత్‌కు మద్దతు ప్రకటించారు.కాగా, భద్రతా మండలిలో భారత్‌కు సాధారణ సభ్యత్వం మాత్రమే ఉంది. భద్రతా మండలిలో ప్రస్తుతం చైనా, అమెరికా, యూకే, ఫ్రాన్స్, రష్యా దేశాలు శాశ్వత సభ్య దేశాలుగా కొనసాగుతున్నాయి. ఈ ఐదు దేశాలకు ప్రత్యేకంగా వీటో పవర్ ఉంటుంది.

రైతన్నకు బాసటగా ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 27 : (నేటినిజం ప్రతినిధి): రైతన్నకు బాసటగా ప్రజా ప్రభుత్వం ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..శుక్రవారం వేములవాడ పట్టణంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ వేములవాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశనికి ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు... రాష్ట్ర ప్రభుత్వం సన్నపురకాల వడ్లకు 500 బోనస్ ప్రకటిస్తుందని తెలిపారు.వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయ భూసార పరీక్షలు నిర్వహించి వాటికి అనుగుణంగా పంగడాలను అందించాలని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలు సమయాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తారని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తుందని, సహకార సంఘాలు వాణిజ్య బ్యాంకులకు దీటుగా వాటితో పోటీపడుతూ రుణాలు మంజూరు చేస్తుందని రైతులకు పైచేయి ఉండడానికి సహకార సంఘాల బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి రైతులు పండించిన పంటలను సగర్వంగా అమ్ముకునేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించారని పేర్కొన్నారు. రైతులకు ఉపయోగపడేలా జలయజ్ఞంతో సాగునీరు అందించారని తెలిపారు. మన ప్రాంతంలో ఆనాడు 1737 కోట్లతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భూమి పూజ చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో త్వరత గతిన పూర్తి చేసే ప్రాజెక్టుల్లో కలికోట సూరమ్మ ప్రాజెక్టు చేర్చి మొన్నటి బడ్జెట్లో 325 కోట్లు నిధులు కేటాయించాలని తెలిపారు. దేశ చరిత్రలోనే ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేసామన్నారు. మీ ఆశీస్సులతో అధికారంలోకి వచ్చాక రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 31 వేల కోట్లు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదింప చేసుకొని జూలై 15 న రుణమాఫీ జీవో తీసుకువచ్చామని, జూలై 18వ తేదీన 0 నుంచి 1 లక్ష వరకు ఉన్న రైతులకు, జులై 30న లక్ష యాభై వేల వరకు, ఆగస్టు 15న 2 లక్షల వరకు మీరు ఎన్నుకున్న ఉన్న ప్రభుత్వం రుణమాఫీ చేసిందన్నారు.

కేవలం 27 రోజుల్లోనే దాదాపు 22.37 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపు రూ.18 వేల కోట్ల రుణమాఫీ నిధులు జమ చేయటం తెలంగాణ చరిత్రలో ఇదే మొదటిసారన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానీ అర్హులైన రైతులకు మా ప్రభుత్వ అండగా ఉంటుందని,10 సంవత్సరాల బిజెపి బిఆర్ఎస్ పరిపాలనలో రేషన్ కార్డులో ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదా అని ప్రశ్నించారు.. రుణమాఫీ చేసే విషయంలో రేషన్ కార్డు కుటుంబానికి ప్రామాణికంగా తీసుకున్నప్పుడు రేషన్ కార్డు లేకపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు.ఇందులో ఆధార్ కార్డు తప్పుల వలన, బ్యాంకర్లు వివరాలు తప్పుగా పంపడం వలన,రేషన్ కార్డ్ లేకుండా కుటుంబంలో సాంకేతిక లోపం వలన,బ్యాంకర్లు గతంలో తండ్రి పేరు పై ఉంటే తదుపరి తండ్రి విదేశాల్లోకి వెళితే వారి కొడుకు పేరు పైన రుణాలు రీ షెడ్యూల్ చేయడం వలన సాంకేతికంగా ఇబ్బందులు ఏర్పడ్డాయనీ పేర్కొన్నారుసాంకేతిక కారణాలతో రుణవ రాఫీ కానీ వారి నుండి దరఖాస్తులు స్వీకరించడానికి గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రైతుల ఇండ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరైతు రుణమాఫీ చేసే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు.

గుడి గుడికో జమ్మి చెట్టు..! దసరా పండగకు గ్రీన్ ఇండియా చాలెంజ్ కొత్త కార్యక్రమం

హైదరాబాద్, సెప్టెంబర్ 27 : దసరా పండగ సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నది. తెలంగాణ రాష్ట్ర వృక్షం జమ్మిని ప్రతీ ఊరిలో, ప్రతీ గుడిలో నాటించాలనే గొప్ప సంకల్పానికి పునాది వేయబోతుంది. దసరా పండుగ నాడు జమ్మి మొక్కలను నాటి లాంఛనంగా ప్రారంభించనున్నది. ఈ కార్యక్రమ పోస్టర్‌ను స్వర్ణగిరి అలయ పూజారి చేతుల మీదుగా రాజ్యసభ మాజీ సభ్యుడు, జీఐసీ ఛైంబర్ జోగినపల్లి సంతోష్ కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు.

వేద కాలం నుంచి అత్యంత ప్రతిష్ఠ కలిగిన చెట్టుగా, భక్తి పూర్వకంగా అందరూ పూజించుకునే జమ్మి చెట్టును తెలంగాణ రాష్ట్ర వృక్షంగా నాటి కేసీఆర్ ప్రభుత్వం గుర్తించింది.

అయితే అనేక కారణా లతో అంతరించిపోతున్న జమ్మి చెట్టు,దాని విశిష్టత రీత్యా ప్రతీ ఊరిలో, ప్రతీ గుడిలో ఉండేలా, గ్రీన్ ఇండియా చాలెంజ్ తరపున ఊరు ఊరుకో జమ్మి చెట్టు– గుడిగుడికో జమ్మి చెట్టు నినాదాన్ని సంతోష్ కుమార్ తీసుకున్నారు.

తెలంగాణలో దసరా నాడు జమ్మి చెట్టును పూజించడం ఆచారం. జమ్మి ఆకులను బంధుమిత్రులకు ఇచ్చిపుచ్చుకుని అందరికీ మంచి జరగాలని కోరుకోవటం కూడా ఆనవాయితీ.

ఈ ప్రాధాన్యతల దృష్ట్యా రానున్న దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఊరుఊరుకో జమ్మిచెట్టు– గుడిగుడికో జమ్మి చెట్టు కార్యక్రమం మొదలవుతుందని భువనగిరి దగ్గర స్వర్ణగిరి అలయంలో జరిగిన పోస్టర్ రిలీజ్ సందర్భంగా సంతోష్‌కుమార్ ప్రకటించారు. ఇప్పటికే పది వేలకు పైగా జమ్మి మొక్కలను సిద్ధం చేస్తున్నామని, అన్ని గ్రామాలు, గుడులకు వీటిని పంపిణీ చేస్తామని చెప్పారు.

గ్రీన్ ఇండియా చాలెంజ్ కోఫౌండర్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కాగానే, రాష్ట్ర వృక్షంగా జమ్మి చెట్టును అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. వేదకాలం నుంచి నిత్య జీవితంలో భాగమైన జమ్మిని ఊరిలో గుడిలో బడిలో భాగస్వామ్యం చేయాలన్న గొప్ప ఆలోచన చేసిన సంతోష్ కుమార్ కు అభినందనలు తెలిపారు. తమ వంతుగా ప్రతీ ప్రాంతంలో జమ్మి మొక్క నాటేలా, రక్షించి పెంచేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సీతారామ ప్రాజెక్టుతో జిల్లా సస్యశ్యామలం

– పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

– యాతాలకుంట టన్నెల్ పనులు శరవేగంగా చేపట్టాలి

– భూసేకరణలో అలసత్వం వహించదు

– సాంకేతిక అనుమతులు సమన్వయంతో పూర్తి చేయాలి

– పాలనాపరమైన అనుమతులలో నిర్లక్ష్యం చేయొద్దు

– నిర్ణిత గడువులోపు నిర్మాణాలన్నీ పూర్తి చేయాలి

– మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్

ఖమ్మం, సెప్టెంబర్ 27 : (నేటినిజం ప్రతినిధి): సీతారామ ప్రాజెక్ట్ టన్నెల్, కాలువల పనులను త్వరితగతిన పూర్తి చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలు మేరకు జలసౌదలో సీతారామ ప్రాజెక్టు పనులపై, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్, రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి మంత్రి తుమ్మల నీటిపారుదల శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ...యాతాలకుంట టన్నెల్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగస్ట్ 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రాజెక్ట్ పంప్ హౌజ్ లను ప్రారంభించామని మిగిలిన కాలువలను, టన్నెల్ పనులను యుద్ధ పాతిపదికను పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎక్కడ కూడా అలసత్వం వహించొద్దని సూచించారు.

అందుకు పాలనా పరమైన అనుమతులలో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. టెండర్ల ప్రక్రియను శరవేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సాంకేతిక పరమైన అంశాలలో నిర్లక్ష్యం వహించకుండా పరస్పరం సమన్వయంతో అన్ని శాఖలు పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నిర్ణిత గడువు లోపు ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రైతాంగానికి ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే తన సీతారామ ప్రాజెక్టు తన చిరకాల స్వప్నం అన్నారు. ప్రాజెక్టుతో జిల్లా రూపురేఖలు మారుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖా సలహాదారుడు అదిత్యా దాస్ నాథ్, ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇ.ఎన్.సి లు అనిల్ కుమార్, నాగేందర్ రావులతో పాటు సీతారామ ప్రాజెక్ట్ సి.ఇ శ్రీనివాస రెడ్డి, ఖమ్మం జిల్లా సి.ఇ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి

–ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

–టచ్ ఫ్యాషన్ ను ప్రారంభించిన ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 27 : (నేటినిజం ప్రతినిధి): యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీని వాస్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ వేములవాడ పట్టణంలోని బై పాస్ రోడ్డులో టచ్ ఫ్యాషన్ ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యువతలో సృజనాత్మకతకు కొదువలే దని తెలిపారు. స్వయం ఉపాధి రంగంలో ప్రభుత్వం అందజేస్తున్న ప్రత్యేక పథకాలు,రాయితీ స్కీంలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత స్వయం ఉపాధి ఎంచుకోవడం ద్వారా తన సొంత కాళ్ల పై తాము నిలబడడంతో పాటు మరి కొందరికి ఉపాధి కల్పించడానికి అవకాశం ఉంటుందన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com